నేటి కందం- నేటికి అందం

హింసను వ్యతిరేకించి-య
హింసకు ప్రోత్సాహము నిడి హేరంబు కృపన్
కంసారిని దలచి-పరమ
హంసల గొలువంగ వలయు నాత్మీయతతోన్

(అక్టోబరు 2 అహింసా దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

అస్తిత్వం కొందరికి
ఆవశ్యం ఎప్పటికి
ఊరేగుతూ ఉంటరూ
ఉనికి కొరకే ఇప్పటికీ
కులం మతం ప్రాంతం
కుంపట్లే వారి పుష్టి
వ్యక్తిగత లబ్ధికొరకు
విడొట్టుడుపైనే దృష్టి



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 2-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:53 పేజీలు:6 వెల: రూ.1/-


## హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం.. ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబర్ 1: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారి తీస్తున్న డీజేలపై హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని 100కు భారీ సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో సమీక్షించిన పోలీసులు.. డీజేలపై నిషేధం విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీజేల అంశంపై ఇటీవల బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజా సింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాచకొండ సీపీ సుధీర్ బాబుతో పాటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలతో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతుందని, ఈ సారి శృతిమించి జరిగిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆరా తీశారని సీపీ తెలిపారు. డీజేలపై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం



హైదరాబాద్, అక్టోబర్ 1: హైదరాబాద్ జంట నగరాల పరిధిలో పలుచోట్ల భారీ వర్షం కురుస్తున్నది. పొద్దంతా భానుడు ప్రతాపం చూపించగా.. సాయంత్రం ఒక్కసారిగా హైదరాబాద్‌ను మేఘాలు కమ్మేశాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడుతున్నది. అత్తాపూర్, రాజేంద్రనగర్, గొల్కోండ, ఖాజాగూడ, మనికొండ, షైక్‌పేట, కూకట్‌పల్లి, పంజాగుట్ట, ఖైరతాబాద్‌లో భారీ వర్షం కురుస్తున్నది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, ప్రగతినగర్, బషీర్‌బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, బేగంపేట, సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్, లక్డీకపూల్, హిమాయత్‌నగర్‌తో పాటు నగరవ్యాప్తంగా పలుచోట్ల జోరువర్షం కురుస్తున్నది. అలాగే, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, షాపూర్‌నగర్, సూరారం, బహదూర్‌పల్లి, పేట్‌బషీరాబాద్, కొంపల్లి, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, కృష్ణాపూర్, గౌడవల్లితో పడుతున్నది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి వాహనదారులు తడిపోయారు. రోడ్లపై భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

## సుప్రీంకోర్టు అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా కూల్చివేతలపై స్టే పొడగింపు

న్యూఢిల్లీ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సుప్రీంకోర్టు అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా కూల్చివేతలపై స్టే ను సుప్రీంకోర్టు మంగళవారం పొడగించింది. న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, కెవి విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం అక్రమ నిర్మాణాలను కూల్చివేయడాన్ని నివారిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనేక రాష్ట్రాల్లో తగిన సమయం ఇస్తూ నోటీసులు జారీచేయకుండానే కట్టడాలను కూల్చివేయడంపై అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. చట్ట విరుద్ధంగా అక్రమ కట్టడాలుంటే కూల్చేయాల్సిందే. కానీ దానికీ ఓ ప్రొసీజర్ ప్రకారమే వెళ్లాల్సి ఉంటుంది.సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రిజిష్టర్ పోస్ట్ ద్వారా నోటీసు పంపాలని, ఒకవేళ దానిని తీసుకోకపోతే వేరే పద్ధతిలో నోటీసు ఇవ్వాలని అన్నారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సి.యు.సింగ్ వాదిస్తూ దేశమంతటా ఒకే రకమైన నోటీస్ పీరియడ్ ఉండాలన్నారు. "అక్రమ కట్టడం అని అధికారులు నిర్ధారణకు వస్తే ఆ ప్రాంతమంతా సర్వే చేయాలి. ఓ నిర్దిష్ట పరిసరాల్లోనే కూల్చేయకూడదు. ప్రత్యేకంగా ఓ ఇంటికే వెళ్లి కూల్చేయకూడదు. ప్రతిదీ మేము చట్ట ప్రకారం చేసామనకూడదు" అని న్యాయవాది ఎం.ఆర్. శంషాద్ అన్నారు.

## ఆస్పత్రిలో చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ అక్టోబర్ 1 (ఎక్స ప్రెస్ న్యూస్ );: బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆస్పత్రిలో చేరారు. వైద్య పరీక్షల కోసం మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం వరకు కవితకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తిహార్ జైలులో ఉన్న సమయంలో కవితకు గైనిక్ సమస్యలకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో రెండు సార్లు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆమెను ఢిల్లీ ఎయిమ్స్ లో చికిత్స అందించిన సంగతి తెలిసిందే.

## బట్టబయలైన ఖమ్మం మిర్చి మార్కెట్ జీరో దందా



ప్రభుత్వానికొచ్చే ఆదాయానికి కుచ్చు టోపీ

- హాజరు పట్టికలో అటెండెన్స్ లేకుండానే కాంటాలు ప్రారంభించిన దడువాయిలు....?

ఇదే మొదలా...?ఆనవాయిత...?

- మార్కెట్ చరిత్రలో మొదటిసారా...?

- ప్రేక్షక పాత్ర వహించిన మార్కెట్ ఉన్నతాధికారి....?

ఖమ్మం, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం మిర్చి మార్కెట్ జీరో దందా మూడు పువ్వులు ఆరు కాయల మాదిరి నాభూతో నాభవిష్యత్ అన్న చందగా చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో హాజరు కాకుండానే కాంటాలు నిర్వహించారు. మార్కెట్ బైలా ప్రకారం ప్రతి రోజు 7.30నిమిషాలకు దడువాయిలకు అటెండెన్స్ నిర్వహించాల్సిన మార్కెట్ అధికారులు మంగళవారం నిర్వహించకపోవడం, హాజరుకు వచ్చినట్టే వచ్చి హాజరు పట్టికలో సంతకాలు పెట్టకపోవడం, 86మంది దడువాయిలుండగా హాజరుకు ముందే రావడం, వచ్చి కూడా సంతకాలు పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ తతంగామ్ అంతా కూడా మార్కెట్ ఉన్నతాధికారి కనుసన్నల్లో నడవడం కొసమెరుపు.

- అసలు దడువాయికి మార్కెట్ కు ఉన్న అనుబంధం,సంబంధం ఏంటి..?దడువాయి విధులు ఏంటి...?

మార్కెట్ కార్యదర్శి సమక్షంలో హాజరై, కాంటాలు మోసుకొచ్చి జెండా పాటా కాగానే కాంటాలు చేయాలి. ఇది వారి డ్యూటీ. రైతుకు, కమిషన్ దారుకు మధ్యనే ఉండాల్సిన దడువాయిలు కొనుగోలు దారుతో ములాఖత్ అయ్యి జీరో దందాకు తెరలేపారనే ఆరోపణలు ఉన్నాయి. కమీషన్ దారు వద్ద ఒకబస్తా కాంటా వేస్తే 5.40పైసలు తీసుకుంటూనే కొనుగోలుదారుడి వద్ద జీరో సరకు కాంట వేసినందుకు 10రూ. ఆర్ డి కాంట వేసినందుకు 5రూ. మొత్తంగా 20.40పైసలు వసూల్ చేస్తున్నారు. అంటే ఒక బస్తాకు 20.40 పైసలన్నమాట. అంటే సీజన్ లో రోజుకు లక్షా యాభైవేల బస్తాలు వెరసి 30,60,000అంటే సగటున ఒక్కో దడవాయికి 35వేల పైమాటే. దానిలో సగం మాకు సగం మీకు అన్నమాట. కేవలం ఇది కంటాలకు సంబంధించిన లెక్క మాత్రమే. సీజన్ లో ఓరైతు 20బస్తాలు కాంటా పెడితే 10బస్తాలకే టాక్స్ అన్నమాట. ఓ సీజన్ లో ఎంత మార్కెట్ వ్యాపారం నడిస్తే దానిలో సగం మాత్రమే రికార్డుల్లోకి ఎక్కుతుంది. మిగతా లెక్కలు గాంధీ గారి డైరీలో ఉంటాయన్న మాట...దీనిలో మార్కెట్ అధికారులకూ వాటాలున్నాయనే బలమైన ఆరోపణలున్నాయి. ఇవన్నీ రైతు నెత్తిన, ప్రభుత్వానికొచ్చే ఆదాయానికి పెట్టె కుచ్చు టోపీనే. ఆరుగాలం కష్టపడ్డ రైతులను, నిద్రాహారాలు మాని ఒళ్ళు హూనం అయ్యేలా శ్రమ చేస్తున్న హమాలీలను దోచుకుంటున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. పొద్దంత కష్టం చేసిన హమాలీలకు 500నుంచి 800 రూపాయలలోపే, అదే దడువాయి సాయంత్రానికి దరిద్రానికి 5000 జేబులో వేసుకుంటున్నాడంటే ఏ స్థాయిలో దోపిడీ ఉందో చెప్పొచ్చు. దడువాయిలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే తాము బ్రతకడంతో పాటు రైతుకు మేలు చేస్తూనే ప్రభుత్వానికి భారీ ఆదాయం చేకూర్చే అవకాశం లేకపోలేదు. కానీ కొనుగోలు దారుతో చేతులు కలిపి రైతుకంట్లో కారం కొట్టి రైతును నట్టేట ముంచడమే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కొనుగోలు దారులు, దడువాయిలు కలిసి గండి కొడుతున్నారు. వారసత్వంగా చేసుకోవాల్సిన దడువాయి పనిని అక్రమంగా లక్షల్లో అమ్మకాలు, కొనుగోళ్ళు చేసి మార్కెట్ ను మాయ చేస్తున్నారు. 86మంది దడువాయిల్లో అక్రమాలకు పాల్పడేది కొందరేనని, వారి ఆగడాలను ప్రశ్నించి,నిఖార్సుగా పనిచేస్తున్న వారిని పలు విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిఖార్సయిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కండ్లు గప్పి మార్కెట్ లో జీరో దందాకు సహకరిస్తున్న మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకొని, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కు పూర్వవైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు

## నేటి నుండి స్కూళ్లకు దసరా సెలవులు

హైదరాబాద్ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : విద్యార్థులకు దసరా సెలవులు వచ్చేశాయి. బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది.

మళ్లీ స్కూళ్లు తెరుచుకునేది అక్టోబర్ 15ననే. దసరాకు చాలా మంది సొంతూళ్లకు వెళ్లనున్నారు. ఒకవేళ ప్రైవేట్ యాజమాన్యం సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవనీ అధికారులు హెచ్చరించారు.

## ఆర్థిక ఇబ్బందులతో.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

ఈ ఘటన సరూర్ నగర్?లో చోటుచేసుకుంది. సోమవారం రాత్రి సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోదండరాం నగర్ లో వి వెంకటేశ్వర ప్రసాద్ అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు.

అయితే, ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో తన భార్య లత, ముగ్గురు కుమారులతో కలిసి వెంకటేశ్వర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు.

స్థానికుల సమాచారంతో హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకున్న సరూర్ నగర్ పోలీసులు కుటుంబం మొత్తాన్ని వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఎవరి ప్రాణాలకు ప్రమాదం లేకపోవడంతో అంత ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు సరూర్ నగర్ పోలీసులు.

## విద్య, వైద్య, సాంకేతిక, రాజకీయ రంగాలలో పద్మశాలీ మహిళలు రాణించాలి:..

-పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక పిలుపు

హైదరాబాద్ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అగ్రకులలో మహిళలు రాణిస్తున్నట్లుగానే పద్మశాలీ మహిళలు కూడా విద్య, వైద్య, సాంకేతిక, వైజ్ఞానిక, మీడియా, రాజకీయ రంగాలలో ఎదగాలని, అందుకు రేపటి తరం ముందుకు రావాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక అమర్ నేత అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అగ్రకులలాలో మహిళలకు వున్న ప్రోత్సాహం పద్మశాలీ సమాజంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. సహజంగా వ్యవస్థలో ప్రతివారికీ ఏదో ఒక లక్ష్యం వుంటుంది. ఆ లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్న ఆరాటం వుంటుంది. కానీ తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు మనకెందుకు అంటూ వారిని వెనక్కిలాగే ప్రయత్నాలు ఎక్కువగా జరుగుతుంటాయి. దాంతో వారిలో ఆత్మన్యూనతాభావం ఏర్పడుతుంది. తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా మహిళలు ఎందులో రాణించాలనుకుంటున్నారో కూడా స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికైనా పద్మశాలీ సమాజంలో ఈ మార్పు రావాలి. ఉన్నత విద్య చదువుకోవాలంటే మనకెందుకు అంటారు. ఇటు వారి జీవిత లక్ష్యాలను నెరవేర్చుకోనివ్వరు అని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యంగా మహిళలు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి జరగడానికి అనేక అవకాశాలు మార్గాలున్నాయి. వాటిని వినియోగించుకోవాలి. వారి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు బ్యాంకులున్నాయి. అసలు బ్యాంకు గుమ్మం తొక్కడానికి కూడా చాలా మంది ఇష్టపడరు. బ్యాంకులు పెద్ద పెద్ద వాళ్లకే రుణాలిస్తాయనే అపోహ ఇంకా మధ్య తరగతి కుటుంబాలలో వుంది. ఉన్నత విద్యల కోసం కూడా బ్యాంకులు రుణాలందిస్తాయి. ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకొని పద్మశాలీ మహిళలు, అమ్మాయిలు గొప్ప పారిశ్రామిక వేత్తలుగా రాణించాల్సిన అవసరం వుంది. ఇక రాజకీయ రంగం గురించి చెప్పుకుంటే బిసిలలో ముఖ్యంగా పద్మశాలీ సమాజంలో మనకెందుకు ఈ రాజకీయాలు అనుకునే వారే నూటికి తొంబై తొమ్మిది శాతం వున్నారు. ఆ ధోరణి మారాలి. మన కోసం, సమాజం కోసం, వ్యవస్థలో మార్పు కోసం, దేశం కోసం ఎందుకు రాజకీయాలు చేయకూడదు అనే భావన రావాలి. మనకు అవకాశాలు ఎవరిస్తారని ఎదురుచూడకూడదు. మన దేశంలోనే కాదు, ప్రపంచ దేశాలలో కూడా మహిళలను ముందుకు రానివ్వకుండా అడ్డుకుంటూనే వుంటారు.

## లేబర్ కార్డు వ్యవస్థను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలి

--ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాముల

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ సెంట్రింగ్ సంఘ0 భవనంలో,భవన నిర్మాణ కార్మిక సంఘంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం లేబర్ కార్డు విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది అని,బిల్డింగ్ పర్మిషన్లో 25 శాతం టాక్స్ భవన నిర్మాణ కార్మిక సంక్షేమం కోసమని, కానీ బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను రద్దు చేసి 4 కోడ్ లుగా విభజించి కార్మిక చట్టాలను ఎత్తివేయడం జరిగిందన్నారు. లేబర్ కార్డు వ్యవస్థను ఎల్ఐసీ లాంటి ప్రయివేటు రంగాలకు అప్పగించి లేబర్ కార్డు వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని ఏఐటీయూసీ ద్వారా డిమాండ్ చేశారు. వాగు పక్కనే ఉన్నప్పటికి ఇసుకకు పర్మిషన్లు లేక కార్మికులు ఇబ్బంది పడు తున్నారని, ఇప్పటికైనా ఇంటి నంబర్లతో ఇసుక పర్మిషన్లు ఇవ్వాలని, ఆన్లైన్ లేబర్ కార్డులు కావడం లేదని,ఆన్లైన్ విధానాన్ని పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికులకు పని వల్ల వేలి ముద్రలు అరిగిపోయి థంబ్ సిస్టం రావడం లేదని అన్నారు. వెంటనే

## పెరిగిన వంటగ్యాస్ సిలిండర్ ధరలు

### 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు

న్యూఢిల్లీ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): చమురు మార్కెటింగ్ కంపెనీలు మరోసారి ధరలు పెంచాయి. దసరా, దీపావళి పండుగలకు ముందు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరను పెంచుతున్నట్లు ప్రకటించాయి. మంగళవారం 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరను రూ.48.50 పెంచాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపాయి. అలాగే 5-కిలోల ఉచిత వాణిజ్య ఒఖఉ సిలిండర్ల ధర రూ. 12 పెరిగింది.తాజా పెంపుతో ఢిల్లీలో 19 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,740కు చేరుకుంది. ఇంతకుముందు రూ.1,691.50 ఉన్నది. గత సెప్టెంబర్ 1న కూడా చమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరను రూ.39 పెంచిన సంగతి తెలిసిందే. కాగా, 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం హైదరాబాద్లో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,967 ఉండగా.. డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.855గా ఉంది.

## అర్హులైన రైతులందరికీ రుణమాఫీ.. త్వరలోనే గుడ్‌న్యూస్..

హైదరాబాద్ అక్టోబర్1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే గుడ్‌న్యూస్.. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో చెప్పినట్లుగా మూడు విడతల్లో ప్రభుత్వం రుణమాఫీ చేసింది. అయితే, చాలా మంది రైతులు తమకు మాఫీ కాలేదంటూ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సర్కార్.. పలు టెక్నికల్ సమస్యల కారణంగా కొంతమంది రైతులకు మాఫీ కాని మాట వాస్తవమేనని తెలిపింది.

సర్కార్ ఆదేశాల మేరకు సమస్యలపై చర్యలు చేపట్టిన అధికారులు.. రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. రేషన్ కార్డు లేకపోవడంతో 4 లక్షల మందికిపైగా అన్నదాతలకు మాఫీ కాలేదని గుర్తించారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ల పేర్లలో తప్పుల వల్ల మాఫీ కాని మరో 1.50లక్షల మందిని నిర్ధారించారు. మొత్తం 5 లక్షలకుపైగా అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే వారి అకౌంట్లలో రూ.5వేల కోట్లను జమ చేయనున్నట్లు తెలుస్తోంది.

## చేనేతలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ తోడ్పాటు

-రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): చేనేత కార్మికులు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని, దీనికి అవసరమైన సంపూర్ణ తోడ్పాటు ప్రభుత్వం అందిస్తుందని, ద్వారా చేనేతలకు లాభం చేకూరుతుందని రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. మంగళవారం వేములవాడ లో పర్యటించిన రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్ లు స్వాగతం పలికారు. అనంతరం వేములవాడలో చేనేత కార్మికుల సమస్యలు , వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బకాయిలు, ఆర్డర్లు తదితర అంశాల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, సిరిసిల్లలో ఎటువంటి సంక్షోభం ఉండవద్దని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని, చేనేత రంగం ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. నూలు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించామని, మిగిలిన బకాయిలు ఉంటే వాటి చెల్లింపుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణలోని మహిళ సంఘాలకు 2 చీరల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా చేనేతలకు ఉపాధి లభిస్తుందని ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. తెలంగాణ సాంస్కృతి, చరిత్రను ప్రతిభంబించేలా మహిళా సంఘాలకు యూనిఫాం విధంగా ఆ చీర ఉండాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని, దానికి కొత్త బ్రాండ్ ఇమేజ్ రావాలని అన్నారు. మహిళా గ్రూపులతో, చేనేత పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడామని , పాలిస్టర్ చీర జరీ అంచు ఉంటుందని అన్నారు. ఆధునికంగా ఉండే విధంగా చీరలు తయారు చేయాలని సీఎం ఆదేశించారని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో స్వతంత్రంగా ఆ చీరలు తయారు చేసే అవకాశం కల్పించాలని ఆసాములు కోరడంతో ప్రభుత్వం ఈ సమావేశం ఏర్పాటు చేసి దానికి తగిన విధంగా చర్యలు చేపట్టిందని అన్నారు. నూలు డిపో పెట్టిన తర్వాత దాని తరలింపు బాధ్యత ఆసాముల దేనని అన్నారు. సొసైటీకి నూలు అప్పగించిన తర్వాత లాభాలను సేట్లు, ఆసాములు, వర్కర్లు ఎలా తీసుకుంటారు అనే అంశాలను వివరించాలని అన్నారు. ప్రస్తుతం వచ్చే లాభం అధికంగా ఆసాములకు చేరాలని ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. 100 శాతం దీని పైన ఆధారపడకుండా ప్రైవేట్ మార్కెట్ లో కూడా చేనేతలు రాణించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. హైదరాబాద్ లో కోఠి,బేగం బజార్ ప్యారడైజ్ చుట్టు పక్కల ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ సూరత్ నుంచి తెచ్చి ప్రింటింగ్ చేస్తున్నారని, మన సిరిసిల్ల చేనేతలు అవకాశాలు అందిపుచ్చుకోవాలని , అవకాశాలను చేనేతలు అందుపుచ్చుకోవాలని ప్రిన్సిపల్ కార్యదర్శి సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత రంగంలో అనుభవం కలిగిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక శ్రద్ధ వహించి సిరిసిల్ల జిల్లా పరిధిలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని అన్నారు. చేనేత సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, గత ప్రభుత్వం పెట్టిన 190 కోట్ల బకాయిలను విడుదల చేశారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టెస్కో జీఏం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త పథకాల వల్ల దీర్ఘకాలంలో కార్మికులకు లాభం చేకూరుతుందని అన్నారు. గతంలో కేవలం వైట్ క్లాత్ మాత్రమే తయారు చేశారని, అక్కడి నుంచి పీసీ, కలర్, జరీ అంచు చీరలు, జకాడ్ క్రమక్రమంగా మార్పు సాధించామని, ఈ మార్పు ఇంకా ముందుకు తీసుకొని వెళ్లాలని అన్నారు. చేనేత వర్గాలు సొంత కాళ్ళ మీద నిలబడాలని అన్నారు. సంఘ అధ్యక్షులకే కాకుండా ఆసాములకు కూడా లాభం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. టెస్కో అందించే ఆర్డర్లను చేస్తూనే ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను చేనేతలు అందిపుచ్చుకోవాలని , హైదరాబాదులో ప్రతిరోజు లక్షల మీటర్ల ఆర్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని, వీటిని చేనేతల సాధించాలని అన్నారు. లఈ

## కృష్ణవేణి పాఠశాలలో అట్టహాసంగా బతుకమ్మ ఉత్సవాలు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ లోని సరస్వతి కృష్ణవేణి పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ ఉత్సవాలను అట్ట హసంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి మన తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పిన పండుగ బతుకమ్మ అని గుర్తుచేస్తూ ప్రతి ఒక్కరు సంస్కృతి సాంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటించాలని కోరారు. ఉత్తమంగా వ్యవహరించాలని, బొడ్డమ్మ ఆరంభం నాటి నుండి మహా అష్టమి వరకు బతుకమ్మ ఆటను ఆకాశమే హద్దుగా అన్నట్టు వివిధ రకాల జానపద గేయాలు, ప్రకృతి పులకరించే పాటలతో చూడచక్కగా వేడుకలను జరుపుకుంటారని, ఊరూ వాడా తేడా లేదనుకుండా రెట్టింపు ఉత్సాహంతో పండుగను వైభవోపేతంగా నిర్వహించుకుంటారని అని అన్నారు. సమజాంలో ఐక్యత, ప్రేమ అనురాగాన్ని ఆవిష్కరించే పండుగ ఇదేనని తెలుపుతూ ప్రకృతి ఒడిలో దొరికేటువంటి వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి గౌరీమాత కృపను పొందుతారన్నారు. బతకమ్మకు అత్యంత ప్రీతికరమైనటు వంటి గౌరీమాతను గుమ్మడి పూలతో తయారు చేసి ఆ అమ్మవారి కృపను వారి పరివారానికి నిలుపు కుంటారని తెలియజేస్తూ బతుకమ్మ పండుగ ద్వారా ప్రేమ అనురాగం చాలా వెల్లివిరిస్తూందని వారు చెప్పారు. ఎనిమిది రోజుల బతుకమ్మ వివిధ రకాల ప్రసాదాలతో ఆరాధించి అమ్మవారి ఆశీస్సులను అధికంగా ఉండేలా చేస్తారని, ప్రత్యేకంగా అమ్మవారి శరనవరాత్రువాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నియమనిష్టాలతో కఠిన ఉపవాసాలను పాఠించి పూజా కైంకర్యాలను నిర్వహిస్తారని, అమ్మవారిని పది రోజులలో పది అవతారాలలో సుందరంగా అలంకరించి అమ్మవారిని సపరివారంగా సుహా సినిలందరు సుందరంగా ప్రతిష్ఠాపనకు, ఆశిర్వచనానికి అట్టహసంగా శ్రీ లలిత సహస్ర నామ పారాయణ ద్వారా ఆహ్వానించి పూజా కార్యక్రమాలను చాలా గొప్పగా నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పాఠశాలలో పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. అదే విధంగా సుమారు 150 పైగా బతుకమ్మలను విద్యార్థులు వివిధ రూపాల్లో తయారుచేసి వారి ఆనందాన్ని కోలాటాల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# "స్వచ్ఛ భారతమే ఆయురారోగ్య భారతం !

## (02 అక్టోబర్ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా)

పుణ్యభూమి భారత్‌కు పరాయి పాలన నుంచి విముక్తి లభించడం మాత్రమే కాకుండా స్వేచ్ఛా భారతం నిండా పరిశుభ్రతతో, సమ్మిళిత సమగ్రాభివృద్ధి చెందిన దేశంగా కూడా మార్చాలని మహాత్మాగాంధీ కలలు కన్నారు. "స్వాతంత్ర్యం కన్న పారిశుద్ధ్యమే మిన్న" అని గాంధీ ఉద్ఘోదించారు. పరిశుభ్రతే సరైన దైవభక్తి అని గట్టిగా నమ్మారు. పరిశుభ్రతే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని మనకు తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిందని, మన దేశ పరిశుభ్రత, పచ్చదనం కూడా సత్వరమే సిధించాలని దేశ ప్రజలను కోరారు.

స్వచ్ఛత వైపు మరో అడుగు:

మహాత్ముని కలలను సాకారం చేయడానికి, స్వచ్ఛత వైపు మరో అడుగు వేయడానికి కేంద్ర గ్రామీణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖలు 2014లో 'స్వచ్ఛ భారత్ అభియాన్ లేదా స్వచ్ఛ భారత్ మిషన్ (క్లీన్ ఇండియా మిషన్)' అనబడే ప్రతిష్టాత్మకమైన జాతీయ పథకాన్ని తీసుకువచ్చారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా 2014-2019 పంచవర్ష కాలంలో 62,009 కోట్ల నిధులతో 4041 పట్టణాల వీధులు, రోడ్ల శుభ్రతతో పాటు పలు మౌళిక వసతులను కల్పించ తలపెట్టారు. 02 అక్టోబర్ 2014న 145వ గాంధీ జయంతి రోజున ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో చీపురు పట్టి రోడ్డును ఊడ్చి దేశ స్వచ్ఛతకు శంఖారావం పూరించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని కట్టడి చేసే ప్రయత్నాలు చేయడం జరిగింది.

మౌళిక వసతుల కల్పన:

స్వచ్ఛ భారత్ పథకం ద్వారా వ్యక్తిగత, వీధి, సామాజిక టాయిలెట్లు నిర్మించ తలపెట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జనతో ప్రజారోగ్యం ప్రభావితం కావడం ద్వారా రోగాలు, చివరకు పిల్లల మరణాలు కూడా కలుగవచ్చు. ల్యాట్రిన్‌ల నిర్మాణమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా తీసుకోవడం జరిగింది. 2014 నుంచి 2019 వరకు 5 ఏండ్లలో భారత్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓపెన్ డిఫెకేషన్-ఫ్రీ, ఓడియఫ్) దేశంగా మార్చాలని భావించి 2019లో సఫలీకృతం అయ్యారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పట్ల దేశవాసులకు పూర్తి అవగాహన కల్పించడానికి పథక రచన చేశారు. ప్రతి ఒక్కరు ఏడాదికి 100 గంటలు స్వచ్ఛ భారత సిద్ధికి సమయం వెచ్చించాలని కోరారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను నియంత్రించుటతో గ్రామీణ భారతం స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంటుందని అంచనా వేశారు. 2019 వరకు అన్ని గ్రామీణ కుటుంబాలకు సురక్షిత నీరు, టాయిలెట్స్ వసతులు, అన్ని పాఠశాలలు/అంగన్‌వాడీలకు టాయిలెట్స్ వసతులు కల్పించనా పథక రచన చేశారు. పట్టణ స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా 1.04 లక్ష గృహాలు, 2.5 లక్షల కమ్యునిటీలకు టాయిలెట్లు, 2.6 లక్షల పబ్లిక్ టాయిలెట్లు, ఘన వ్యర్థాల నిర్వహణలు సిటీల్లో చేపట్టారు. బహిరంగ మలమూత్ర విలర్జనను నివారించడం, సాధారణ లాయిలెట్లను ఫ్లష్ టాయిలెట్లుగా మార్చడం, అమానవీయ స్కావెంజర్ వ్యవస్థను రద్దు చేయడం లాంటి లక్ష్యాలను చేరేందుకు కృషి చేస్తున్నారు.

స్వచ్ఛ భారత్ సాఫల్యతలు:

2014-19 మధ్య అమలు చేయబడిన స్వచ్ఛ భారత్ ఫలితంగా పిల్లల డయేరియా సమస్యలు తగ్గాయి. స్వచ్ఛ భారత్ అమలైన 4,372 పట్టణాల్లో 4,340 నగరాలు (99 శాతం) ఓడియఫ్‌గా ప్రకటించబడ్డాయి. ఈ పథకం ద్వారా 66.72 లక్షల పబ్లిక్/కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించబడ్డాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ద్వారా దేశంలో అత్యుత్తమ క్లీన్ సిటీలను ఎంపిక చేశారు. స్వచ్ఛ భారత్ అమలుతో 10 కోట్ల కుటుంబాలకు టాయిలెట్స్ నిర్మాణం, 6 లక్షల గ్రామాలను ఓడియఫ్‌గా మార్చారు. 02 అక్టోబర్ 2014న 38.7 శాతం గృహాలకు టాయిలెట్స్ ఉండగా, 02 అక్టోబర్ 2019 నాటికి 100 శాతం టాయిలెట్ వసతులు కల్పించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ఫేజ్-1 పథకాన్ని 2014 నుంచి 2019 వరకు నిర్వహించారు. 2020-21 నుంచి 2024-25 వరకు ఫేజ్-2 తీసుకున్నారు.

స్వచ్ఛ భారతమే సురక్ష భారతి, ఆయురారోగ్య ప్రదాయిని అని ప్రస్తుతించాల్సిందే. సువిశాల భారతంలో నెలకొన్న జనాభా విస్పోటనం, నిరుద్యోగ పర్వం, నిరక్షరాస్యత నెలవులుగా మారడంతో స్వచ్ఛ భారత సాధన కష్టమే అని తెలుస్తున్నది. పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుద్ధత లాంటివి ప్రజా అవగాహనతోనే పరిపూర్ణం అవుతాయని తెలుసుకుందాం. మన ఆరోగ్యం కోసం మనమే నడుం బిగిద్దాం, పరిశుభ్ర ఆరోగ్య భారత స్వప్నాలను సాకారం చేసుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాష్ట్రపతిని కలిసిన ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: తాజాగా శిక్షణను పూర్తి చేసుకున్న 76 మంది ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారుల బృందం (ఆర్ఆర్-2023 బ్యాచ్) భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముతో రాష్ట్రపతి భవన్ లో ఈ రోజు సమావేశమయ్యారు.

శిక్షణను పూర్తి చేసుకున్న అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ... వివిధ అఖిల భారత సర్వీసులలో, ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)కు ఓ ప్రత్యేకమైన గుర్తింపు, ప్రాముఖ్యం ఉన్నాయన్నారు. శాంతిభద్రతలు - ప్రభుత్వానికి పునాది మాత్రమే కాదనీ, ఆధునిక పాలనా వ్యవస్థకు గుర్తు అని ఆమె వ్యాఖ్యానించారు. అర్థమయ్యేలా చెప్పాలంటే, తోటి పౌరుల దృష్టిలో చాలా ప్రాంతాల్లో, చాలా సందర్భాల్లో, ప్రభుత్వానికి ప్రతినిధులుగా ఐపీఎస్ అధికారులు ఉంటారనీ, పాలనా యంత్రాంగంలో పౌరులు మొదట కలిసేది ఐపీఎస్ అధికారులనేనని ఆమె అన్నారు.

రానున్న కాలంలో ఉన్నతోన్నత శిఖరాలను అందుకోవాలని దేశం ఒక లక్ష్యంగా పెట్టుకున్నందున, ఐపీఎస్ అధికారులు పోషించవలసిన పాత్ర మరింత కీలకమని రాష్ట్రపతి అన్నారు. శాంతిభద్రతలు బాగున్నప్పుడు మాత్రమే ఒక దేశ ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. శాంతిభద్రతలను కాపాడలేనపుడు, న్యాయాన్ని కాపాడుకోలేనప్పుడు, ప్రజల హక్కులకు రక్షణ లేనప్పుడు- అభివృద్ధికి అర్థం లేదన్నారు.

మహిళా ఐపీఎస్ అధికారుల సంఖ్య ఇటీవల కాలంలో పెరగడంపై రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. పెరిగిన మహిళల సంఖ్య- పోలీసింగ్ తీరులో మార్పును తెస్తుందని, పోలీసు-సామాజిక సంబంధాలు మెరుగవుతాయని- ఈ పరిస్థితి దేశానికి మేలు చేస్తుందని అన్నారు.

కొత్తతరం టెక్నాలజీల వల్ల శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను పసిగట్టడం, వాటిని ముందుగానే నిరోధించడం వంటివి నేటి కాలంలో సాధ్యమవుతున్నాయని, పోలీసింగ్ మెరుగయ్యిందనీ తెలిపారు. మరోవైపు నేరగాళ్లు, తీవ్రవాదులు కూడా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు, సైబర్ దాడులూ పెరుగుతున్న నేపథ్యంలో- ఐపీఎస్ అధికారులు టెక్నాలజీ ప్రేమికులుగా ఉండాలనీ, నేరగాళ్ల కంటే ముందుండాలనీ ఆమె సూచించారు.

భుజస్కంధాలపై బరువైన బాధ్యతలను మోపుతున్నందున, ఐపీఎస్ అధికారులపై మానసిక ఒత్తిడి ఉండొచ్చని చెబుతూ- వారు మానసికంగా దృఢంగా తయారవ్వాలనీ, యోగా, ప్రాణాయామం, ఒత్తిడిని తగ్గించే వ్యాయామాలు దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు. ఐపీఎస్ అక్షరాల్లో చివరి ఇంగ్లిషు అక్షరం- 'ఎస్' అంటే సర్వీసు (సేవ) అన్న అర్థాన్ని కూడా గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తెలిపారు. ప్రజలకూ, దేశానికి సేవ చేయడం అన్న పరమోన్నత లక్ష్యాన్ని మరవొద్దంటూ ఆమె- ప్రొబేషనరీ అధికారులతో అన్నారు.

# ఉగ్రవాదానికి ఏ రూపంలోనూ స్థానం లేదన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఫోన్ చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను వివరించారు.

ఉగ్రవాదానికి ఏ రూపంలోనూ చోటు లేదని పీఎం మోదీ తెలిపారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను నిరోధించడానికి, బందీలను సురక్షితంగా విడుదల చేయడానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.

శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ సిద్ధంగా ఉంటుందని ప్రధాని తెలిపారు.

భారత్, ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా వివిధ ద్వైపాక్షిక అంశాలపై ఇద్దరు నాయకులు చర్చించారు.

ప్రధాని నెతన్యాహూతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూదులందరికీ రోష్ హషానా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

తరచూ సంప్రదింపులు కొనసాగించాలని ఇద్దరు నేతలు అంగీకరించారు.

# 'స్వచ్ఛ భారత్ మిషన్'కు పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో అక్టోబరు 2న 'స్వచ్ఛ భారత్ దివస్-2024'లో పాల్గొంటున్న ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: పరిశుభ్రత దిశగా అత్యంత కీలక ప్రజా ఉద్యమాలలో ఒకటైన 'స్వచ్ఛ భారత్ మిషన్' (ఎస్‌బిఎం)కు శ్రీకారం చుట్టి 10 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో అక్టోబరు 2న గాంధీజీ 155వ జయంతి నాడు నిర్వహించే 'స్వచ్ఛ భారత్ దివస్-2024' కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొంటారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉదయం 10:00 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

ఇందులో భాగంగా రూ.9600 కోట్లకుపైగా విలువైన పారిశుధ్య-పరిశుభ్రత సంబంధిత పలు పథకాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు "అమృత్, అమృత్ 2.0" కింద పట్టణ నీటి సరఫరా-మురుగు శుద్ధి వ్యవస్థల మెరుగు లక్ష్యంగా రూ.6,800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు పునాదిరాయి వేస్తారు. అలాగే, 'క్లీన్ గంగ జాతీయ మిషన్' కింద గంగానది పరీవాహక ప్రాంతాల్లో జల నాణ్యత మెరుగుదల-వ్యర్థాల నిర్వహణపై రూ.1550 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులు, 'గోబర్'ధన్ పథకం కింద రూ.1332 కోట్ల విలువైన 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్ల నిర్మాణానికి నాంది పలుకుతారు.

గడచిన దశాబ్ద కాలంలో పారిశుధ్య రంగంలో దేశం సాధించిన విజయాలతోపాటు ఇటీవల ముగిసిన 'స్వచ్ఛతా హి సేవ' ఫలితాలను కూడా 'స్వచ్ఛ భారత్ దివస్' కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. జాతీయ స్థాయిలో సాగిన ఈ కృషిని తదుపరి దశకు తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమం ఒక వేదిక కానుంది. అంతేకాకుండా సంపూర్ణ పరిశుభ్రత స్ఫూర్తి దేశం నలుమూలలకూ విస్తరించే దిశగా స్థానిక పరిపాలన సంస్థలు, మహిళా-యువజన సంఘాలు, సాంఘిక సేవా సమాజాల నాయకులు కూడా ఇందులో భాగస్వాములవుతారు.

దేశవ్యాప్తంగా 'స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా 'స్వచ్ఛతా హి సేవ-2024' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ సుస్థిరతపై నిబద్ధతతో యావత్ ప్రజానీకం మరోసారి ఏకీకృతం కావడంలో ఇది ఎంతగానో దోహదం చేసింది. ఈ మేరకు 17 కోట్ల మందికిపైగా ప్రజల భాగస్వామ్యంతో 19.70 లక్షలకుపైగా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 6.5 లక్షల మేర పరిశుభ్రత లక్షిత యూనిట్ల రూపాంతరీకరణ సాధించారు. అంతేగాక సుమారు 1 లక్ష 'సఫాయి మిత్ర' సురక్ష శిబిరాలు నిర్వహించారు. వీటి ద్వారా 30 లక్షల మంది 'సఫాయి మిత్ర' కార్యకర్తలకు ప్రయోజనం చేకూరింది. మరోవైపు 'అమ్మ పేరిట ఓ మొక్క' కార్యక్రమం నిర్వహించి, 45 లక్షలకుపైగా మొక్కలు నాటారు.

# కొలిక్కి వస్తున్న కొలికపూడి వ్యవహారం.. నిజం గెలవాలి దీక్షకు సిద్ధం..



అమరావతి, అక్టోబర్ 1: ఇటీవల వివాదాస్పదమవుతున్న తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చేలా కనిపిస్తుంది. పలు సందర్భాలలో ఆయన కార్యకర్తలు, విలేకరులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం వివాదాస్పదమయ్యాయి. అన్ని వైపులనుండి ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ వస్తూనే పార్టీ అధినేతలకు సైతం ఫిర్యాదులు పెద్ద ఎత్తున వెళ్లాయి. ఎప్పటికప్పుడు తనపై వచ్చిన విమర్శలు ఆరోపణలను తిప్పి కొడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, సోమవారం నిజం గెలవాలి పేరిట దీక్షకు దిగేందుకు తిరువూరులోని తన కార్యాలయంలో సిద్ధమయ్యారు.

కార్యకర్తలు నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించిన కొలికపోడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిజం గెలవాలి తప్పు చేసిన వారికి శిక్ష పడాలని నినాదాలు చేశారు. గత వారం రోజులుగా తన గురించి తప్పుడుగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మొదటిరోజు పేకాట, రెండోరోజు ఆత్మహత్య ప్రయత్నం, మూడోరోజు లైంగిక వేధింపులు ఇసుక, గ్రావెల్, మట్టి అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు.

సాక్ష్యాలు బయట పెట్టకుండా తనపై అసత్య ఆరోపణలు చేయడం దారుణం అన్నారు. అయితే తనలాంటి బాధ్యతమైన స్థానంలో ఉన్న వ్యక్తి అటువంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, కానీ ఇప్పుడు తన మాటలకు బాధపడిన విలేకరులందరికీ బహిరంగ క్షమాపణలు చెబుతున్నట్లు ప్రకటించారు. నా మీద చేసిన ఆరోపణలు నిజమైతే, నన్ను అరెస్టు చేసి శిక్షించమన్నారు. ఆరోపణలు అబద్ధమైతే వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

దీనిపై ఎటువంటి చర్యలు తీసుకునేంతవరకు తాను దీక్షలో కూర్చుంటానని ప్రకటించి వెంటనే దీక్షలో కూర్చున్నారు. అయితే కొందరు పెద్దలు కలగజేసుకుని ఆయనకు సర్దు చెప్పడంతో కొద్దిసేపటికి ఆయన దీక్షను విరమించుకున్నారు. ప్రస్తుతం విలేకరులపై కొలికపూడి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై ఆయన బహిరంగ క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఈ వ్యవహారం ఇక్కడితో ఫుల్ స్టాప్ పడుతుందో కొనసాగుతుందో వేచి చూడాలి.

# నంద్యాల రైల్వే స్టేషన్ లో పట్టాలు తప్పిన గూడ్స్..

అమరావతి, అక్టోబర్ 1: సౌత్ సెంట్రల్ రైల్వే మార్గంలోని నంద్యాల రైల్వే స్టేషన్ లో రైలు పట్టాలు తప్పిన వైనం చోటుచేసుకుంది. స్టేషన్ అధికారులు తెలిపిన వివరాల మేరకు? మంగళవారం ఉదయం రైలు స్టేషన్ లోకి రాగానే ఐదో ఫ్లాట్ ఫారం వద్ద పట్టాలు తప్పింది. ఐదు బోగీలు పట్టాలు తప్పి కిందికి ఒరిగాయి.

ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడం విశేషం. ఆ ప్రాంతంలో ప్రయాణికులు కూడా ఎవరూ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన పట్టాలను పునరుద్ధరించారు. సాంకేతిక నిపుణులు అప్పటికప్పుడు వచ్చి రైల్వే ప్లాట్ ఫారంలోని పట్టాలు తప్పిన వాటిని పునరుద్ధరించారు. ఈ గూడ్స్ రైళ్లు విజయవాడ నుంచి బళ్లారి సైడ్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేదని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటాద్రి దొరస్వామి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# బొందుగుల, పారుపల్లి ఉన్నత పాఠశాలలోవిద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు,గ్లాసుల పంపిణీ



యదాద్రి భువనగిరి, అక్టోబర్ 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యదాద్రి భువనగిరి జిల్లా రాజా పేట మండలం బొందుగుల,పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భువనగిరి పట్టణానికి చెందిన ప్రవాస భారతీయులు జడల మాధుర్, తొడుపునూరి శ్రీనివాస్ ల సహకారంతో విద్యార్థులకప్లేట్స్ మరియు గ్లాసులు వ పంపినీ చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్లా ప్రభాకర్ మాట్లాడుతు పాఠశాల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు, ప్రవాస భారతీయులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన,వారి మిత్రుడు బేగంపేట పాఠశాల ఉపాధ్యాయుడు కె.ప్రదీప్ కన్నా ఎన్నారైలను సమన్వయ పరుస్తున్న గుండ శ్రవన్ కు ధన్యవాదాలు తెలిపారు. మండల విద్యాధికా అధికారి చందా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు మరిన్ని సహాయ సహకారాలు అందించాలని ఔఖీఎ లను కోరారు. ఈ కార్యక్రమంలో కురారం ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి ఉపాధ్యాయులు మాధవి, జయశీల ,రజనీ, పరమేష్ పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురు దుర్మరణం

ఆదిలాబాద్, అక్టోబర్ 1: ఆదిలాబాద్ జిల్లాగుడిహత్నూర్ మండలం మేకలగండి జాతీయ రహదారిపై అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. బైనీసా నుండి పికప్ వాహనంలో ఆదిలాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మ్యాక్స్ వాహనం సైడ్ పిల్లర్ల ను ఢీకొట్టి దూసుకెళ్లడం తో ఘటనలో ముగ్గురు పిల్లలతో సహా అయిదు గురి మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా రిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారంతా అదిలాబాద్ పట్టణం టీచర్స్ కాలనీ వారుగా గుర్తించారు.మృతులు మొజుద్దీన్ (60), మొయినొద్దీన్ (40),అలీ (8),ఉస్మానొద్దీన్ (10),ఉస్మాన్ (12) గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.భైంసా లో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# వన్ నేషన్ పేరిట హక్కులను కాలరాస్తోన్న కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ అక్టోబర్ 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వన్ నేషన్ పేరిట హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శలు చేశారు. వన్‌నేషన్ పేరుతో హక్కులను కాలరాస్తు ఆర్డినెన్సు లు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు.ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతామని వార్నింగ్ ఇచ్చారు. నేపాల్‌లో అధిక వర్షాల ప్రభావం బీహార్ మీద పడిందని చెప్పారు. దాన్ని పరిశీలించడానికి కేంద్ర పార్టీ బృందం వెళ్తోందని తెలిపారు. అక్కడ ఎలాంటి సహాయచర్యలు చేపట్టాలనే దానిపై సమావేశంలో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని అన్నారు.. హైడ్రాపై నారాయణ షాకింగ్ కామెంట్స్ చేశారు. హైడ్రా చాలా హడావుడి చేస్తోందన్నారు. వికారాబాద్‌లో ఫిరంగి నాలానీ ప్రక్షాళన చేయాలని గతంలో వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ర్యాలీ చేపట్టామని గుర్తు చేశారు.చెరువులు, కుంటలు ఉంటే భూ గర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్సులు, అక్రమ నిర్మాణాలు కూల్చితే పెద్దగా సమస్యే లేదని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని నిర్వాసితు లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపి ంచి మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.. కొంతమంది అడ్డు పడుతారు.. సమస్య ఉంది కాబట్టి వ్యతిరేకిస్తారని అన్నారు. నిర్వాసితు లను కొత్త ఇళ్లలోకి తరలించిన తర్వాత కూల్చాలని సూచించారు. పేదలకు ప్రత్యామ్నాయాలు చూపకుం డా కూల్చొద్దని కోరారు. ఫిరంగి నా లాను ప్రక్షాళన చేయాలని అన్నారు.కమర్షియల్ కాంప్లెక్సలు అక్రమంగా ఉంటే కూల్చాల్సిందేనని అన్నారు. పేదలకు అన్యాయం చేయొద్దని తెలిపారు. భారత దేశంలో మౌలిక సదుపాయాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. హైవేలకు , ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అయితే... ఎక్స్‌ప్రెస్ హైవేలో సైడ్స్‌లో చాలా హైట్‌లో గోడలు కడుతున్నారని వివరించారు. రైతుల భూములు చుట్టూ ఉంటాయని... వారు ఎక్కడ నుంచి నడవాలని ప్రశ్నించారు. తాత్కాలిక ఉపశమనం కోసం అక్కడక్కడ గ్యాప్ ఇస్తున్నారని చెప్పారు. కానీ తమ డిమాండ్ మొత్తం దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలనేదే ప్రధాన డిమాండ్ అని తెలిపారు. సర్వీస్ రోడ్‌లో ఉండాల్సిందేనని చెప్పారు. అభివృద్ధి జరగాలి.. అంటే... అదాని అభివృద్ధి కాదని.. అందుకే కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి లేఖ రాశామని తెలిపారు.

# క్షమాపణ చెప్పాల్సిందే..

## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

హైదరాబాద్, అక్టోబర్ 1: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఇవాళ నిరసన సెగ తగిలింది. ముషీరాబాద్ వద్ద ఆయనను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నాయి. గోబ్యాక్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశాయి. మూసీ నది పరివాహకప్రాంత నివాసితులకు భరోసా కల్పించేందుకు ఆయన వెళుతుండగా.. ముషీరాబాద్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది.

మూసీ నది రివర్ బెడ్ పరిధిలో ఉన్న నివాసాల కూల్చివేతలు ఈ ఉదయం ప్రారంభమయ్యాయి. ఖాళీ చేసిన ఇళ్లను అధికారులు కూల్చి వేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. కూల్చివేతలను పరిశీలించేందుకు, బాధితులకు భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ చాదర్ ఘాట్ కు బయల్దేరారు.

విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ముషీరాబాద్ వద్ద కేటీఆర్ కాన్వాయ్ ను అడ్డుకున్నాయి. కొందరు కేటీఆర్ ప్రయాణిస్తున్న వాహనంపైకి కూడా ఎక్కారు. మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కు బాధ్యత వహిస్తూ కేటీఆర్ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు.



# శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం.. వివాదం

## -సుప్రీంకోర్టు సీరియస్

## - దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: (ఎక్స్ ప్రెస్ న్యూస్ )శ్రీ.: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవుపలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిన్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో ఇవాళ (సోమవారం) విచారణ జరిపింది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# అక్టోబరు 2న ప్రధానమంత్రి జార్ఖండ్ పర్యటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అక్టోబరు 2వ తేదీన జార్ఖండ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం దాదాపు 2 గంటల సమయంలో ప్రధానమంత్రి జార్ఖండ్ లోని హజారీబాగ్ లో రూ. 83,300 కోట్లకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం తోపాటు, కొన్నింటిని ప్రారంభిస్తారు.

ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా గిరిజన సముదాయాల సమగ్ర, సర్వతోముఖ అభివృద్ధికి పాటుపడాలన్న తన నిబద్ధతకు అనుగుణంగా– మొత్తం రూ.79,150 కోట్లకు పైగా వ్యయంతో అమలు కానున్న 'ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' పథకాన్ని ప్రారంభించనున్నారు. 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 549 జిల్లాలు, 2,740 బ్లాకుల పరిధిలోని దాదాపు 63 వేల పల్లెల్లో గల 5 కోట్లకు పైచిలుకు ఆదివాసీ నివాసితులకు ఈ కార్యక్రమం లబ్ధిని చేకూర్చనుంది. కేంద్ర ప్రభుత్వంలో 17 మంత్రిత్వ శాఖలు, విభాగాలు అమలు చేసే 25 కార్యక్రమాల ద్వారా మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి రంగాలలో ఉన్న లోటుపాట్లను చక్కదిద్ది, ప్రభుత్వ పథకాల తాలూకు ప్రయోజనాలను అందరూ అందుకొనేట్లు చూడాలన్నదే ఈ అభియాన్ లక్ష్యం.

గిరిజనులకు విద్య పరమైన మౌలిక సదుపాయాలను పెంచే కృషిలో భాగంగా, 40 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలల (ఇఎమ్ఆర్ఎస్) ను ప్రధానమంత్రి ప్రారంభించడంతో పాటు ఇఎమ్ఆర్ఎస్ తరహా 25 పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన ను కూడా చేయనున్నారు. వీటి కోసం రూ.2,800 కోట్లకు పైగా ఖర్చవుతుంది.

'ప్రధానమంత్రి జన్ జాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎమ్-జెఎన్ ఎఎమ్ఎన్)' లో భాగంగా రూ.1360 కోట్ల పైచిలుకు విలువ కలిగిన అనేక ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో 1380 కిలో మీటర్లకు పైగా పొడవైన రహదారి మార్గాల పనులు, 120 అంగన్‌వాడీలు, 250 బహుళ ప్రయోజన కేంద్రాలు, 10 పాఠశాల వసతి గృహాలు ఉన్నాయి. పీఎమ్-జన్ మన్ లో భాగంగా పలు ప్రతిష్ఠాత్మక పథకాలను కూడా ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు.

అట్టడుగు స్థాయిలో ఉన్న 3,000 పల్లెలకు చెందిన 75,800 గిరిజనులు ల(పర్టిక్యులర్లీ వల్నరబల్ ట్రైబల్ గ్రూప్స్- పివిటిజి)కు చెందిన ఆవాసాలకు విద్యుచ్ఛక్తి సరఫరా, 275 సంచార వైద్యాలయాల పునరుద్ధరణ, 500 అంగన్‌వాడీ కేంద్రాల పునరుద్ధరణ, 250 వన్ ధన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు, 5,550 కి పైగా పివిటిజి నివాసితుల గ్రామాలకు 'పంపుల ద్వారా తాగునీటి సరఫరా ('నల్ సే జల్') వంటి పథకాలు ఉన్నాయి.

# శ్రీ మిథున్ చక్రవర్తి కి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం: ప్రధాన మంత్రి అభినందనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: భారత చలనచిత్ర రంగానికి అందించిన అనమానమైన సేవలకు గాను ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని' శ్రీ మిథున్ చక్రవర్తికి ప్రదానం చేయనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆయనకు అభినందనలు తెలియజేశారు. శ్రీ మిథున్ చక్రవర్తి సాంస్కృతిక రంగంలో ఓ ప్రముఖుడు; ఆయన బహుముఖ పాత్రపోషణ ప్రతిభ ప్రేక్షకలోకంలో తరాలకు అతీతంగా ప్రశంసలకు పాత్రమైందంటూ శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు.

కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ సామాజిక ప్రసార మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఒక సందేశానికి ప్రధాన మంత్రి ప్రతిస్పందిస్తూ, తన అభిప్రాయాన్ని ఈ కింది విధంగా వ్యక్తం చేశారు:

"భారత చలనచిత్ర రంగానికి శ్రీ మిథున్ చక్రవర్తి అందించిన సాటిలేనటువంటి సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాకరమైన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించడం నాకు సంతోషాన్ని కలిగించింది. సాంస్కృతిక రంగంలో ఆయనో ప్రముఖుడు, అనేక విధాల పాత్రలను చాలా ప్రతిభాన్వితంగా ఆయన పోషించిన తీరు తరాలకు అతీతంగా ప్రేక్షకుల అభిమానానికి నోచుకొంది. ఆయనకు ఇవే అభినందనలు, శుభాకాంక్షలు కూడా..."

# ప్రైవేటు రేడియో ప్రసారకర్తల కోసం డిజిటల్ రేడియో ప్రసార విధానం

# రూపకల్పనకు సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసిన ట్రాయ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ప్రైవేటు రేడియో ప్రసారకర్తల కోసం డిజిటల్ రేడియో ప్రసార విధానాన్ని రూపొందించేందుకు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఈరోజు సంప్రదింపుల పత్రాన్ని(సీపీ) విడుదల చేసింది.

ప్రస్తుతం భారత్‌లో అనలాగ్ టెరెస్ట్రియాల్ రేడియో ప్రసారాలు మీడియం వేవ్(ఎండబ్ల్యూ) (526-1606 ఐఊళి), షార్ట్ వేవ్(ఎస్‌డబ్ల్యూ) (6?22 ఓఊళి), వీహెచ్ఎఫ్-ఎవి (88?108 ఓఊళి) స్పెక్ట్రమ్ బాండ్లపై నడుస్తున్నాయి. వీహెచ్ఎఫ్-ఎవి బాండ్‌లో విస్తారమైన ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్(ఎఫ్ఎం) సాంకేతికత ఉన్నందున దీనిని ఎక్కువగా ఎఫ్ఎం బాండ్ అని పిలుస్తుంటారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆల్ ఇండియా రేడియో(ఏఐఆర్) ఎండబ్ల్యూ, ఎస్‌డబ్ల్యూ, ఎఫ్ఎం బాండ్లపై రేడియో ప్రసార సేవలను అందిస్తోంది. ప్రైవేటు రంగ రేడియో ప్రసారకర్తలకు మాత్రం ఎఫ్ఎం ఫ్రీక్వెన్సీ బాండ్ (88-108 ఓఊళి)లో మాత్రమే కార్యక్రమాలను ప్రసారం చేయడానికి అనుమతి ఉంది.

అనలాగ్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్‌తో పోలిస్తే డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ అనేక ప్రయోజనాలను కల్పిస్తుంది. ఒకే ఫ్రీక్వెన్సీ కారియర్‌పై మూడు నుంచి నాలుగు చానళ్లను ప్రసారం చేసే సామర్థ్యం ఉండటం డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్‌లో ప్రధాన ప్రయోజనం. పైగా అన్ని చానళ్ల ఆడియో నాణ్యత కూడా అద్భుతంగా ఉంటుంది. అనలాగ్ పద్ధతిలో మాత్రం ఒక ఫ్రీక్వెన్సీ కారియర్‌పై ఒకే చానల్ ప్రసారాలు మాత్రమే సాధ్యమవుతాయి. ఈ పోటీ వాతావరణంలో రేడియో ప్రసారకర్తలకు డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ అనేది ఉత్సాహవంతమైన కొత్త అవకాశాలను కల్పిస్తుంది. శ్రోతలకు సైతం విలువ ఆధారిత సేవలను అందించవచ్చు.

అనలాగ్ ఎండబ్ల్యూ, ఎస్‌డబ్ల్యూ రేడియో ప్రసార వ్యవస్థను డిజిటలీకరణ చేసే పనిని ఆల్ ఇండియా రేడియో(ఏఐఆర్) ప్రారంభించింది. ఇందులో భాగంగా 38 అనలాగ్ ట్రాన్స్‌మిట్టర్ల స్థానంలో డిజిటల్ ట్రాన్స్‌మిటర్లను ఏర్పాటు చేసింది. ఎఫ్ఎం బాండ్‌లో డిజిటల్ రేడియో సాంకేతికతలపై ఏఐఆర్ ఇప్పటికే ట్రయల్స్ నిర్వహించింది. అయితే, ఎఫ్ఎం డిజిటలీకరణకు ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ప్రసారకర్తలు మాత్రం ఇంకా చొరవ తీసుకోవాల్సి ఉంది.

డిజిటల్ రేడియో ప్రసారాలను విస్తరించే సౌలభ్యం కల్పించే అనుకూల వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు 2018 ఫిబ్రవరి 1న "భారత్‌లో డిజిటల్ రేడియో ప్రసారాలకు సంబంధించిన అంశాల"పై ట్రాయ్ సొంతంగా పలు ప్రతిపాదనలు చేసింది. డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సమష్టిగా పని చేసేలా ప్రోత్సహించేందుకు రేడియో ప్రసారకర్తలు, ప్రసార పరికరాల తయారీదారులు, డిజిటల్ రేడియో రిసీవర్ తయారీదారులు వంటి అందరూ భాగస్వామ్య పక్షాలను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ట్రాయ్ గుర్తించింది. నిర్ణీత కాల వ్యవధిలో డిజిటల్ రేడియో ప్రసారాలను ప్రారంభించేందుకు సమగ్ర ప్రణాళికను అందించేలా భారత్‌లో డిజిటల్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ కోసం విధానపరమైన ప్రాథమిక ప్రణాళికను ప్రభుత్వం రూపొందించాల్సి ఉందని అథారిటీ పేర్కొన్నది.

దీంతో ప్రైవేటు రేడియో ప్రసారకర్తల కోసం డిజిటల్ రేడియో ప్రసార విధానాన్ని రూపొందించేందుకు ఏప్రిల్ 23న ట్రాయ్ నుంచి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలను కోరింది. సాంకేతికత మార్పునకు వీలు కల్పించేలా ప్రస్తుతం ఎఫ్ఎం ఫేస్-3 కింద ఉన్న పలు నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని ఎంఐబీ ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. డిజిటల్ రేడియో ప్రసార విధాన రూపకల్పన కోసం ప్రతిపాదనలను రూపొందించేందుకు పరిగణనలోకి తీసుకోవాల్సిన పలు అంశాలను ఎంఐబీ ప్రధానంగా పేర్కొన్నది.

ఈ క్రమంలో ప్రైవేటు రేడియో ప్రసారకర్తల కోసం డిజిటల్ రేడియో ప్రసార విధానాన్ని రూపొందించడానికి సంబంధించి వివిధ అంశాలపై భాగస్వామ్యపక్షాల అభిప్రాయాలు సేకరించేందుకు గానూ ట్రాయ్ సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. సంప్రదింపుల పత్రంపై భాగస్వామ్య పక్షాలు వచ్చే నెల 28వ తేదీ లోగా రాతపూర్వకంగా అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా కోరింది. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబరు 11 లోగా అందజేయాల్సిందిగా కోరింది. అభిప్రాయాలు, వాటిపై అభ్యంతరాలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో జీటలఎఇఃబ-2ఏబితీజితి.ఐనీల.తిని, తీబిజీటలఎఇఃబ-1ఏబితీజితి.ఐనీల.తిని మెయిల్ ఐడీలకు పంపించవచ్చు.

మరింత వివరణ/ సమాచారం కోసం +91-11- 20907774 నెంబరు ద్వారా సలహాదారు(బీ అండ్ సీఎన్) శ్రీ దీపక్ శర్మను సంప్రదించవచ్చు.

సంప్రదింపుల పత్రానికి సంబంధించిన పూర్తి పాఠం ట్రాయ్ వెబ్‌సైట్ లిలిలి.బితీజితి.ఐనీల.తినిలో అందుబాటులో ఉంటుంది.

# మరింత వేగంతో "మేక్ ఇన్ ఇండియా"

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: సరళతర వ్యాపార నిర్వహణలో భాగంగా– 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ వాణిజ్య సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బీఆర్‌ఏపీ)- 2024 దేశవ్యాప్తంగా లోప రహిత వ్యాపార నియంత్రణ విధానాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా అమలు చేయనున్నది. దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడమే ఈ విధానం ఉద్దేశం. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) మార్గదర్శకత్వంలో బీఆర్‌ఏపీ-2024 ఇటు వ్యాపార సంస్థల, అటు పౌరుల అవసరాలను తీర్చేందుకు నూతన సంస్కరణలను ప్రవేశపెట్టనుంది. ఇదివరకటి విధానాలు సత్ఫలితాలను ఇవ్వడంతో ఆ విధానాలకు కొనసాగింపుగానూ, వ్యాపార సంస్థలు పాటించవలసిన నిబంధనల భారాన్ని మరింత తగ్గించడం, అపరాధాలుగా పేర్కొన్న అంశాల పట్టికలో నుంచి అనేక నిబంధనలను తొలగించడం, ప్రపంచ బ్యాంకు త్వరలో తీసుకు రానున్న బి-రెడీ (ః-ఖీఇంఆజ) కార్యక్రమంలో ప్రధాన అంశాల స్ఫూర్తిని కలుపుకోవడం వంటి ప్రభుత్వ కీలక కార్యక్రమాల లక్ష్యాలకు అనుగుణంగా 'బీఆర్‌ఏపీ- 2024' రూపొందింది. ఈ మేలు కలయిక నియంత్రణ సంబంధిత ప్రక్రియలను క్రమబద్ధీకరించడంతో పాటు ఆర్థికవృద్ధికి అండగా నిలిచి, భారతదేశంలో వ్యాపారానికి సంబంధించిన విధానాల పై పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని ఇప్పటి కన్నా పెంచనుంది.

త్వరలో అమలులోకి రానున్న బీఆర్‌ఏపీ-2024 విధానం ఒక సరికొత్త మదింపు పద్ధతిని ప్రవేశపెట్టనుంది. దీనిలో సాక్ష్యాలతోను, ప్రతిస్పందనలతోను ముడిపడి ఉండే మూల్యాంకనాలను జోడించి ఒక సమగ్ర, చైతన్య భరిత దృక్పథాన్ని తీర్చిదిద్దారు. ఏదైనా నిర్ణయానికి సంబంధించిన ఆమోదాన్ని తెలియజేయడానికి పడుతున్న కాలాన్ని తగ్గించడం, ఇంటర్ నెట్ ఆధారిత సేవల అందజేతకు కూడా అవకాశాలను కల్పించడం, జాతీయ ఏక గవాక్ష వ్యవస్థ, పీఎమ్ గతిశక్తి వంటి కార్యక్రమాల ప్రయోజనాలను అందుకునేందుకు వీలు కల్పించడం ద్వారా మరింత పారదర్శకత్వంతో కూడిన సమర్థమైన, చురుకైన నియంత్రణ వ్యవస్థకు బీఆర్‌ఏపీ-2024 బాటను పరచనుంది.

పెట్టుబడులు పెట్టడానికి మొగ్గు చూపే దేశంగా భారతదేశాన్ని మలచడానికి ప్రక్రియలను సులభతరం చేయడాన్ని, నియమాల పాలన తాలూకు భారాన్ని తగ్గించడాన్ని, డిజిటల్ మాధ్యమ సంబంధిత సేవలను అమలు పరుస్తుండడాన్ని బీఆర్‌ఏపీ-2024 కొనసాగిస్తున్నది. బీఆర్‌ఏపీ ముందుగా అనుకున్న అంశాలకు తోడు కార్మిక శక్తి, పర్యావరణం, పన్నులు, భూ నిర్వహణ, యుటిలిటీ పర్మిట్లు, తనిఖీ, ఇంకా నిర్మాణం వంటి ముఖ్య రంగాలనన్నింటిని లెక్క లోకి తీసుకొంది.

అలాగే సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)ని అక్కున చేర్చుకోవడం, ప్రక్రియలలో మార్పుచేర్పులను చేయడం వంటి కొత్త రంగాలను కూడా తన పరిధి లోకి చేర్చుకొని, ప్రభుత్వం వైపు నుంచి వ్యాపార రంగానికి సేవలను అందించడం మరింత వేగంగాను, మరింత సమర్థంగాను ఉండేటట్లుగా ఈ విధానం చూస్తుంది.

బీఆర్‌ఏపీని 2014-2015 లో మొదటిసారిగా తీసుకు వచ్చారు. ఇది భారతదేశంలో వ్యాపార ముఖచిత్రానికి సరికొత్త రూపు, రేఖలను ఇచ్చి, పోటీతత్వంతో కూడిన సమాఖ్య వాదానికి స్ఫూర్తిగా నిలిచింది. ఇప్పటి వరకు బీఆర్‌ఏపీ ఆరు సంచికలు ఫలప్రదం అయ్యాయి. సంస్కరణలను ఏ స్థాయిలో అమలుపరిచాయనే అంశంపై రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను మూల్యాంకనం చేయడమనే బీఆర్‌ఏపీ విశిష్ట దృష్టికోణం చాలా దేశాలలో అరుదుగా మాత్రమే చోటు చేసుకొనే ప్రక్రియ. వేరు వేరు రంగాలకు ఎదురయ్యే సవాళ్ళకు సమాధానాలను వెతకడంతో పాటు వ్యాపార నిర్వహణకు సానుకూల పరిస్థితులను ఏర్పరచి దేశవ్యాప్తంగా అనేక పెట్టుబడి కేంద్రాలను ఏర్పాటు చేయడంపైన శ్రద్ధ వహించారు.

పౌరుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ సంస్కరణలను ప్రవేశపెట్టడంలో భాగంగా బీఆర్‌ఏపీ- సేవలను అందించడంలో పారదర్శకతపై దృష్టిని సారించింది. విధానాలు, రుసుములు, గడువులకు సంబంధించి స్పష్టమైన సమాచారం ఇటు వ్యాపార సంస్థలకు, అటు పౌరులకు లభ్యమయ్యేలా జాగ్రత తీసుకొంది. ఈ కార్యక్రమం వ్యాపారాలు వృద్ధి చెందేటట్లుగా, మరింత దక్షతతో కూడిన ప్రతిస్పందన ప్రధాన పాలన వ్యవస్థ పౌరులకు అందేటట్లుగా ఒక వ్యవస్థను తీర్చి దిద్దాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టికోణానికి సరిపోలినదిగా ఉంటున్నది.

# గాంధీ.. గొప్ప 'పీపుల్స్ ఎకనామిస్ట్'!

**-భారత సుదర్శన్, విశ్లేషకులు ఉ సీనియర్ జర్నలిస్ట్ -**

హైదరాబాద్, అక్టోబర్ 1: భారత స్వాతంత్రోద్యమ నాయకుడు మహాత్మా గాంధీ కేవలం పోరాట యోధుడే కాదు..గొప్ప ఆర్థికవేత్త అనే విషయం చాలా మందికి తెలియదు. భారత స్వాతంత్ర్య పోరాటంలో దేశం ఆమూలాగ్రంగా పర్యటించిన మహాత్మా గాంధీ దేశ బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి పునాదులు వేయగలిగాడు. దేశంలో పేదరిక తగ్గించేందుకు, ప్రజలకు చేతినిండా పని కల్పించే మార్గాలను అన్వేషించి ఆచరణలో తెచ్చేందుకు గాంధీ ప్రయత్నించాడు. మహాత్మా గాంధీ యొక్క రాజకీయ ఆర్థిక వ్యవస్థ యొక్క మూలాలు మరియు ఔచిత్యం చాలా గొప్పవి. గాంధీ యొక్క ఆర్థిక విధానం గ్రామం లేదా స్వయం సమృద్ధి ఆర్థిక శాస్త్రం ఆధారంగా రూపొందించబడింది. గ్రామాన్ని స్వయం సమృద్ధిగా ఆర్థిక యూనిట్ గా మార్చాలనే గాంధీ ఆలోచన నుండి ప్రేరణ పొంది, ఆ మహా నాయకుడి ఆలోచనలను అమలు చేయడానికి ఎంతోమంది ప్రయత్నించారు..ప్రయత్నిస్తూనే ఉన్నారు. నిజానికి గ్రామ యువకులను మద్యపానం మానేయమని ప్రోత్సహించడం, లాభదాయకమైన ఉపాధిని చేపట్టడం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం లాంటివన్నీ గాంధీ ఆర్థిక విధానంలో ప్రధానమైనవే.

డాక్టర్ షూమేకర్ అనే ఆర్థికవేత్త గాంధీని గొప్ప 'పీపుల్స్ ఎకనామిస్ట్'గా అభివర్ణించాడు. భౌతికవాదానికి వ్యతిరేకంగా ఆధ్యాత్మికతతో ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా ఉండే ప్రజల ఆర్థికవేత్తగా గాంధీని షూమేకర్ గుర్తించాడు. గాంధేయ ఆర్థిక శాస్త్రాన్ని 'పీపుల్స్ ఎకనామిక్స్'గా అన్వయించాడు. అభివృద్ధి యొక్క ఆర్థిక సాధనాలు ప్రజలపై ఆధారపడి ఉంటాయి. పేదలు ఎందుకు పేదలుగా ఉన్నారని అడగడం ప్రారంభించాలని, వారి శూన్య ఉత్పాదకతను ఎలా పెంచగలగాలనే ఆలోచన చేయాలని గాంధీ తెలిపారు. గాంధీ 'జనాల ద్వారా ఉత్పత్తి' అని పిలుపునిచ్చి, గ్రామాలు మరియు పేద నివాసుల మోక్షం లేకుండా భారతదేశం యొక్క మోక్షం అసాధ్యమని అన్నారు.

భారతదేశంలో ధనవంతులు చాలా ధనవంతులు అయ్యారు. పేదల సంఖ్య తీవ్రంగా పెరిగింది. గాంధీ ఇవ్వాటి రోజున జీవించి ఉన్నట్లయితే..దేశంలోని ప్రస్తుత పరిస్థితులను చూసి తీవ్ర వైఫల్యానికి సంకేతంగా భావించేవారేమో.

గాంధీ ఆర్థిక శాస్త్రం గురించి మనం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. దేశంలో పేదరికం మరియు గ్రామీణ జనాభా దృష్ట్యా భారతదేశం సమృద్ధి ఆర్థిక శాస్త్రం మరియు స్కేల్ ఎకనామిక్స్ మధ్య సమతుల్యతను సాధించాల్సిన అవసరం ఉంది. గాంధీ యంత్రాలకు, పరిశ్రమలకు వ్యతిరేకం కాదనే విషయాన్నీ మనం అంగీకరించాలి.

ఆనాడే గాంధీ ప్రింటర్ మరియు ప్రింటింగ్ ప్రెస్ లను ఉపయోగించాడు. గాంధీ రైళ్లలోనూ విస్తృతంగా ప్రయాణించారు. ఒక ఆవిరి నౌకను ప్రారంభించడాన్ని గాంధీ ప్రశంసించారు. అహ్మదాబాద్ లోని ఆధునిక మిల్లుల గురించి అతను గర్వపడ్డాడు. గాంధీకి యంత్రాలపై ఉన్న ప్రేమ, ఆసక్తి తదితర విషయాలతో అతని ఆర్థిక విధానం మనకు బోధపడుతుంది. పెట్టుబడిదారీ మరియు శ్రామిక వర్గానికి మధ్య సమతౌల్యాన్ని పునర్వ్యవస్థీకరించడానికి హింసాత్మక విధానాలు సమాజాలను అస్థిరంగా వదిలివేస్తాయని గాంధీ అభిప్రాయపడ్డారు. అవకాశాల సమానత్వం కోసం గాంధీ తన ప్రాధాన్యతను స్పష్టంగా వ్యక్తపరిచాడు. అందరికీ ఒకే సామర్థ్యం లేనందున అసమాన ఫలితాల యొక్క అనివార్యతను గాంధీ అంగీకరించాడు. ఉన్నతమైన తెలివితేటలు ఉన్న వ్యక్తికి ఎక్కువ సంపాదించడానికి అనుమతిస్తానన్నాడు. సమాజ ప్రయోజనాల కోసం సంపన్నులు విశ్వసించే ఆస్తిగా సంపద అనే గాంధీ యొక్క ఆలోచన ఆధునిక పెట్టుబడిదారీ దుష్ప్రవర్తనకు తగిన విరుగుడు అని చెప్పవచ్చు.

గ్రామ స్వరాజ్యం అంటే స్వయం సమృద్ధిగా కానీ వికేంద్రీకరించబడిన చిన్న-స్థాయి ఆర్థిక నిర్మాణం మరియు భాగస్వామ్య ప్రజాస్వామ్యంతో కూడిన గ్రామ గణతంత్రాలు..

దాదాపు ఏడు లక్షల గ్రామాలకు పైబడిన భారతదేశంలో సామాజిక, నైతకి మరియు ఆర్థిక స్వేచ్ఛను సాధించడం. గ్రామాలు నశిస్తే భారతదేశం నశిస్తుంది అన్నారు. కొంతమంది ఆధునిక ఆర్థికవేత్తలు మాత్రం గాంధీ దృష్టిని తిరోగమనం అన్నారు. జాతీయ విముక్తి కోసం పోరాటాన్ని నడిపించడంలో అతని నైపుణ్యాన్ని మెచ్చుకున్న చాలా మంది అతని రాజకీయ నాయకత్వానికి చెల్లించాల్సిన మూల్యంగా అతని అభిప్రాయాలను అయిష్టంగానే సహించినట్లుగా అక్కడక్కడా మనకు అనిపిస్తుంటుంది. అయితే చాలామంది గాంధీ ఆర్థిక అంతర్ దృష్టిని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు.






# ఏపీలో కానిస్టేబుల్ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్

## -త్వరలోనే కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

అమరావవతి అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని హోంశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇవాళ (మంగళవారం) ప్రకటించారు. slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవాలని అభ్యర్థులకు ఆమె సూచించారు. ఏపీలో కానిస్టేబుల్ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్మరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని హోంశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇవాళ (మంగళవారం) ప్రకటించారు. slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవాలని అభ్యర్థులకు ఆమె సూచించారు. రకరకాల కారణాలతో నిలిచిన ఎంపిక ప్రక్రియకు కూటమి ప్రభుత్వ చొరవతో మోక్షం లభించనుందని ఆమె తెలిపారు. ఆంధ్రప్ర దేశ్‌లో అర్థాంతరంగా ఆగిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించిందని చెప్పారు.,100 పోస్టుల భర్తీకి సంబంధించిన శారీరక సామర్థ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలను 5 నెలల్లోగా పూర్తి చేస్తామని మంత్రి స్పష్టంగా ప్రకటించారు. 2022లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 4,59,182 మంది హాజరుకాగా అందులో 95,209 మంది తదుపరి దశకు ఎంపికయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పలు ఇతర కారణాలతో పరీక్షలు వాయిదాపడ్డాయి. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ (సివిల్)- 3580, కానిస్టేబుల్ -2520 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ వాయిదా పడింది.

# వయోవృద్ధులకు అందుబాటులోకి డే కేర్ సెంటర్.

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.**

హన్మకొండ, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి)వయోవృద్ధుల సంక్షేమంలో భాగంగా డే కేర్ సెంటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వయోవృద్ధుల కోసం హనుమకొండలోని జిల్లా పరిషత్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ భవనాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లోని ఫిజియోథెరపీ యూనిట్ తోపాటు వసతులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జడ్పీ హాలులో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతిని వెలిగించి ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వయోవృద్ధులకు అందుబాటులోకి 20 రోజుల్లో డే కేర్ సెంటర్ ఏర్పాటు కావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. డే కేర్ సెంటర్ లో వయోవృద్ధులకు ఫిజియోథెరపీ సేవలు, లైబ్రరీ, ఆట వస్తువులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. డే కేర్ సెంటర్ ను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రిబ్యునళ్ల ద్వారా కేసుల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వయోవృద్ధులకు సంబంధించిన కేసులను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డే కేర్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రాజమణి మాట్లాడుతూ హనుమకొండ, పరకాల డివిజన్ల పరిధిలో నిరాధారణకు గురైన వృద్ధుల ఫిర్యాదుల పరిష్కారం కోసం రెండు ట్రిబ్యునళ్లు పనిచేస్తున్నాయని తెలిపారు. వయోవృద్ధులకు గుర్తింపు కార్డులను అందజేసినట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల అవసరాల కోసం చేయూత అంబులెన్స్ ను అందుబాటులో ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ వయో వృద్ధులకు డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఎంజీఎం ఆసుపత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేక ఓపీ సదుపాయాన్ని కొనసాగించాలని కోరారు. జడ్పీ సీఈవో విద్యాలత మాట్లాడుతూ పెద్దల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ మర్యాదలు పాటించాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమంలో భాగంగా కొద్ది రోజుల్లోనే డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రారంభమయ్యే విధంగా కలెక్టర్ కృషి చేశారని, అందుకు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ అనితా రెడ్డి మాట్లాడుతూ వయో వృద్ధులకు వృద్ధాప్యం శాపం కాకూడదని అన్నారు. వృద్ధాప్యంలో ఉన్న కన్నవారిని ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. వయోవృద్ధులను సంతోషంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వయోవృద్ధులకు వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు అందిస్తున్న వైద్య సేవలను గురించి ఈ సందర్భంగా వివరించారు. వయో వృద్ధులకు సంబంధించిన వివిధ హక్కులు, సదుపాయాలు, వైద్య సేవల గురించి తేరాల యుగేందర్, విశ్రాంత ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ చంద్రమౌళి, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా వయోవృద్ధులను కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వాసుదేవా చారి,డాక్టర్ చంద్రమౌళి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, సిడిపిఓ విశ్వజ, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.



# బేషరతుగా రూ.2 లక్షలు రైతుల అకౌంట్ లో జమ వేయాలి

-లేకుంటే ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుంది
-ఎవరి మాట వినని సైకో, ప్రజలను ఏడిపించి ఆనందించే శాడిస్ట్ ముఖ్యమంత్రి
-బిజెఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి గారు శాసనసభలో అనేక సమస్యల మీద ప్రస్తావించినా కూడా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది.
-రేవంత్ రెడ్డికి చట్టం మీద నమ్మకం ఉంటే వెంటనే రాజీనామా చేయాలి
– రైతు హామీల సాదన దీక్ష ముగింపు సభలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బేషరతుగా రూ.2 లక్షలు రైతుల అకౌంట్ లో జమ చేయాలనీ మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేసారు.

రైతు హామీల సాదన దీక్ష ముగింపు సభలో ఈటల రాజేందర్ మాట్లాడారు. రైర్ట సమస్యలు పట్టించుకోక పోతే ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందనీ హెచ్చరించారు. ఎవరి మాట వినని సైకో, ప్రజలను ఏడిపించి ఆనందించే శాడిస్ట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని నిప్పులు చెరిగారు. బిజెఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి గారు శాసనసభలో అనేక సమస్యల మీద ప్రస్తావించినా కూడా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సత్తా, శక్తి భారతీయ జనతా పార్టీకే ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులారా రేవంత్ రెడ్డి మెప్పుకోసం మీరు పలుకుతున్న చిలకపలుకులు వీా గౌరవం తగ్గిస్తాయి. బిజెపి మీద ప్రెస్ మీట్ పెట్టడం కాదు, ఆత్మపరిశీలన చేసుకోండి. బేషరతుగా రూ.2 లక్షలు రైతుల అకౌంట్ లో జమ వేయాలి. లేదంటే నమ్మిన రైతులే ఈ ప్రభుత్వాన్ని బొందపెడతారు. ఎల్లుండి ఇందిరాపార్క్ వద్దనే రింగ్ రోడ్డు అంశంపై ధర్నా ఉంది.

రేవంత్ బ్రెయిన్ చైల్డ్... హైడ్రా, మూసీ ప్రక్షాళన కాబట్టి.. నిన్న కోర్టు చివాట్లు పెట్టింది. మొట్టికాయ వేసింది, అధికారులను కాదు, రేవంత్ రెడ్డికి. నిజంగా రేవంత్ రెడ్డికి చట్టం మీద నమ్మకం ఉంటే వెంటనే రాజీనామా చేయాలి.

కోర్టులు, జడ్జీలు అంటే లెక్కలేదా- రోజుకో మాటతో అధికారులు తప్పించుకుంటున్నారంటే హైడ్రా ఎంత పేలవంగా ఉందో అర్థం అవుతుంది. ఓడ దాటే దాక ఓడమల్లయ్య, ఓడ దాటిన తరువాత బోడి మల్లయ్య మాదిరిగా రేవంత్ రెడ్డి చేసిన మోసానికి ప్రజలే భరతం పడతారు. 24 గంటల రైతు హామీల సాధన దీక్షకు సహకరించిన పోలీసులు, మీడియా, కళాకారులకు ధన్యవాదాలు.

## కెన్యాలోని మొంబాసా రేవులో ఐఎన్ఎస్ తల్వార్: ముగిసిన సముద్ర భాగస్వామ్య విన్యాసాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: అందరికీ భద్రత, వృద్ధి కోసం ప్రధాన మంత్రి నిర్దేశించిన 'సాగర్' దార్శనికతలో భాగంగా తూర్పు ఆఫ్రికాతో పెరుగుతున్న భారత్ సంబంధాలను బలోపేతం చేస్తూ... ఐఎన్ఎస్ తల్వార్ నౌక 2024 సెప్టెంబర్ 22 నుండి 25 వరకు కెన్యాలోని మొంబాసా రేవును సందర్శించింది.

పరస్పర నిర్వహణ, సహకారాన్ని పెంపొందించడానికి భారత కెన్యా నావికాదళాల సిబ్బంది నౌకాశ్రయ స్థాయిలో విస్తృతంగా వృత్తిపరమైన పరస్పర భేటీల్లోనూ, సందర్శనల్లోనూ నిమగ్నం అవుతున్నారు. ఐఎన్ఎస్ తల్వార్ కమాండింగ్ ఆఫీసర్ కెన్యా నేవీ డిప్యూటీ కమాండర్ బ్రిగేడియర్ జెఎస్ కిస్వాతో మొంగ్వే నేవల్ బేస్ లో సమావేశమయ్యారు. రెండు నావికాదళాల మధ్య వృత్తిపరమైన సమావేశాలు, శిక్షణలను కొనసాగించడంపై వారు చర్చించారు.

ఐఎన్ఎస్ తల్వార్ నౌక పై రెండు నావికాదళాల సిబ్బంది విజిట్, బోర్డ్, సెర్చ్ అండ్ సీజర్ (వి బిఎస్ఎస్), న్యూక్లియర్, బయోలాజికల్, కెమికల్ డిఫెన్స్ (ఎన్ బి సి డి ) ప్రదర్శనలతో సహా వృత్తిపరమైన సంభాషణలు కూడా చోటుచేసుకున్నాయి. మరింతగా రెండు నావికాదళాల ఉద్యోగులు యోగ, క్రీడా కార్యక్రమాలతో సందడి చేశారు. ప్రజా సందర్శన కార్యక్రమంలో భాగంగా- ఐఎన్ఎస్ తల్వార్ సిబ్బంది స్థానికంగా ఉన్న అనాథాశ్రమాన్ని సందర్శించారు. కెఎన్ఎస్ షుజా కమాండ్ బృందం ఐఎన్ఎస్ తల్వార్ ను సందర్శించి ప్రత్యేక ఆర్థిక మండలి ( ఎక్స్ క్లూజీవ్ ఎకనామిక్ జోన్ - ఇ ఇ జడ్) సర్విలెన్స్, మారిటైమ్ పార్టనర్షిప్ ఎక్సర్ సైజ్ (ఎం పి ఎక్స్) కోసం విన్యాస కార్యక్రమాన్ని ఖరారు చేసింది. తిరుగు ప్రయాణంలో ఐఎన్ఎస్ తల్వార్ నౌక కెఎన్ఎస్ షుజాతో కలసి జాయింట్ ఇఇజెడ్ సర్విలెన్స్, ఎంపిఎక్స్ లో పాల్గొంది. రెండు నౌకలు ఉన్నత స్థాయి వృత్తిపరమైన సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. ఐఎన్ఎస్ తల్వార్ మొంబాసా నౌకాశ్రయ సందర్శన, భారత కెన్యా నావికా దళాల పరస్పర విన్యాసాలు 2023 డిసెంబర్ లో బహిరిలో విడుదల చేసిన సంయుక్త దార్శనిక ప్రకటనలో పేర్కొన్న లక్ష్యాలను సాకారం చేసే దిశగా రెండు దేశాల సహకార ప్రయత్నాలను చాటి చెప్పాయి.

# పండిత పామరులను రంజింపజేసే శక్తి సంగీతానిది

– కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1: సంగీతానికి సరిహద్దులతో పాటు భాషా భేదాలు లేవని, పండిత



పామరుల హృదయం దోచే మహత్తర శక్తి సుస్వర సంగీతానికి మాత్రమే ఉందని లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా లీడి ఇండియా నేషనల్ క్లబ్ కరీంనగర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విశ్వ మానవాళిని ఏకం చేయడం, విభేదాలను మరిచి ఉత్తమ సంగీతాన్ని ఆస్వాదించడం ప్రజలకు అలవాటు అయ్యిందని మన అనుభవంలోకి వస్తున్నదని తెలిపారు. సంగీత సాధకులు రేపటి తరానికి క్లాసికల్ మ్యూజిక్ను వరంగా అందజేయడానికి గురుశిష్య పరంపరను కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రాంతంలో ప్రముఖ సంగీత విద్వాంసులు కె బి శర్మను లీడ్ ఇండియా బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డితో పాటు కార్యదర్శి డా: ఎస్ మనోహరా చారి, కోట సత్యం, డా ఎం మహేందర్, ఇనుగుర్తి రమేష్, మేకల అరవింద్, వడుకాపురం జగదీశ్వరాచారిపాల్గొని కె బి శర్మను సన్మానించారు.

# వాయుసేన కొత్త అధిపతిగా ఏపీ సింగ్ బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: భారత వైమానిక దళం అధిపతి (సీఏఎస్)గా ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ వాయుసేన ప్రధాన కార్యాలయం (వాయు భవన్)లో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

సీఏఎఫ్ 1984, డిసెంబరు 21న భారత వైమానిక దళం ఫైటర్ స్ట్రీమ్లో నియమితులయ్యారు. ఆయన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ అలాగే నేషనల్ డిఫెన్స్ కాలేజీ పూర్వ విద్యార్థి. ఆయన అర్హీకృత వైమానిక శిక్షకులు. అలాగే వివిధ రకాలయిన ఫిక్స్డ్ వింగ్, రొటేటరీ వింగ్ విమానాలను 5000 గంటల కంటే ఎక్కువ సమయం పాటు నడిపిన అనుభవం గల ప్రయోగాత్మక టెస్ట్ పైలట్.

ఆయన తన ఉద్యోగ కాలంలో మిగ్-27 స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్గా, ఎయిర్ బేస్- ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్గా పనిచేశారు. టెస్ట్ పైలట్గా, రష్యాలోని మాస్కోలో మిగ్ 29 అప్గ్రేడ్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ బృందానికి నాయకత్వం వహించారు. తేజస్ విమాన పరీక్షలను చూస్తున్న నేషనల్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్లో ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఫ్లైట్ టెస్ట్)గా కూడా సేవలందించారు. నాలుగు దశాబ్దాల తన ఉద్యోగ జీవితంలో, సీఏఎస్ సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఎయిర్ డిఫెన్స్ కమాండర్గా, ఈస్టర్న్ ఎయిర్ కమాండ్లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్గా పనిచేస్తున్న సమయంలో సిబ్బంది నియామకాలను చేపట్టారు. వాయుసేన అధిపతిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన వాయుసేన ఉప అధిపతిగా ఉన్నారు.

సీఏఎస్ తన విధి నిర్వహణలో పరమ విశిష్ట సేవా పతకం (పీవీఎస్ఎమ్), అతివిశిష్ట సేవా పతకం (ఏవీఎస్ఎమ్)లను అందుకున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వాయుసేనను ఉద్దేశించి ప్రసంగిస్తూ... భారత వైమానిక దళానికి నాయకత్వం వహించే బాధ్యత తనకు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా వైమానిక దళానికి, నాన్ కంబాటెంట్లు (నమోదు చేసుకున్నవారు), డీఎస్సీ సిబ్బంది, పౌరులు, వారి కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ... వాయుసేన కార్యాచరణ సామర్థ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చడంలో వారి అపూర్వమైన మద్దతు, అంకితభావం పట్ల సీఏఎస్ సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

గతంలో వైమానిక దళాన్ని ముందుకు నడిపించిన అనుభవజ్ఞులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ఐఏఎఫ్ విజయానికి వారి అత్యున్నత కృషి, గొప్ప నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. 'సశక్త్, సక్షమ్, ఆత్మనిర్భర్' ఐఏఎఫ్ నిర్మాణం కోసం దృష్టిసారించాల్సిన అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ, కమాండర్లు మెరుగైన నాయకత్వాన్ని అవలంబించాలని అలాగే ఐక్యతను, సమష్టితత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ప్రస్తుత అనిశ్చిత భౌగోళిక-రాజకీయ పరిస్థితులపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. "భారత వైమానిక దళం మంచి కార్యాచరణ సామర్థ్యం కలిగి ఉండి, ఎల్లప్పుడూ అప్రమత్తంగా, యుద్ధాన్ని నివారించేదిగా ఉండటం చాలా ముఖ్యం" అని అన్నారు. గొప్ప సంప్రదాయాలను అనుసరిస్తూ మనమంతా కలిసికట్టుగా సగర్వంగా ఆకాశమంత ఎత్తున నిలబడదామని అన్నారు.

# బాసరలో దసరా ఉత్సవాలు.. మంత్రి కొండాకు ఆహ్వానం..



ఆదిలాబాద్, అక్టోబర్ 1: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవ ఆహ్వాన పత్రికను మంగళవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖకు ఆలయ ఈఓ విజయరామారావు, ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి అందజేశారు.

హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖను ఆలయ ఈఓ విజయరామారావు, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, అర్చకులు నవీన్ శర్మ పట్టు శాలువాతో సత్కరించి, ఆశీర్వచనలు అందించారు. 3 నుండి 12 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలినడకను తిరుమలకు పవన్ పయనం



తిరుపతి, అక్టోబర్ 1: ప్రాయశ్చిత్త దీక్ష విరమించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుమలకు బయల్దేరారు. అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేసిన అనంతరం కాలినడకన తిరుమలకు పయనమయ్యారు. పవన్ రాకతో కూటమి నేతలు, జనసేన కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం పవన్ కళ్యాణ్.. శ్రీవారిని దర్శించుకుని ప్రాయశ్చిత్త దీక్ష విరమిస్తారు. అనంతరం అన్న ప్రసాద కేంద్రాన్ని పరిశీలించనున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడో ఒక చోట ఆలయాల అపవిత్రతకు పరిస్థితులు దారితీశాయి. తమ కూటమి ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకుంటుంది. ఖచ్చితంగా అటువంటి చర్యలకు పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారనే దానిపై ప్రాథమిక ఆధారాలు లేకుండా సీఎం చంద్రబాబు నేరుగా ఎలా ప్రకటన చేస్తారంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. అలాగే దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. దీనిపై స్పందించిన పవన్ . కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు చెప్పలేదన్నారు. న్యాయస్థానం ముందున్న సమాచారం ఆధారంగా ఆ వ్యాఖ్యలు చేసిందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చెప్పలేదు కానీ.. తేదీ విషయంలో మాత్రమే కాస్త కన్ఫ్యూజన్ ఉందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉల్లంఘనలు ఆలయాల విషయంలో చాలా జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వాటిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి అన్ని చర్యలు తీసుకుంటుందని, అలాగే దాదాపు 219 ఆలయాలను అపవిత్రం చేసినట్లు తెలిపారు. కాగా తాను దీక్ష చేపట్టడంపై పవన్ స్పందిస్తూ.. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ముందుకు తీసుకువెళ్లాలనే దీక్ష చేపట్టారన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు అవసరం ఇప్పుడు చాలా ఉందని, ఆ బోర్డు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలని తాను కోరుకుంటున్నానన్నారు. ఆలయాల పరిరక్షణకై ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. తాను ఈ దీక్షను పూర్తి చేసిన తర్వాత, డిక్లరేషన్ చేస్తామని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలకు భారీ భద్రత..



తిరుపతి, అక్టోబర్ 1: తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేదీవరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. తిరుమలలో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

అందుబాటులో 2 వేలకు పైగా సీసీ కెమెరాలను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తామన్నారు. తిరుమాడ వీధుల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు..

పయాణికలకు భద్రత ప్రథమ ప్రాధాన్యం కింద తీసుకుని ఆర్టీసీలో ప్రయాణం భద్రత ఉంటుందని అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఇన్చార్జి ఎండీ గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు.. తిరుమలకు సమీప ప్రాంతాల నుంచి అదనపు బస్సులను నడుపుతున్నామని చెప్పారు.




# క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ (క్యూకెడి) టెక్నాలజీ' కోసం 'ఆర్మీ ఐడెక్స్ ప్రాజెక్ట్' ద్వారా ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: స్వయం సమృద్ధ భారతం కార్యక్రమంపై భారత సైన్యం తన నిబద్ధతను చాటుకుంటోంది. ఈ మేరకు ఇవాళ 'ఇన్నొవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్' (ఐడెక్స్) ద్వారా 8వ కొనుగోలు ఒప్పందంపై సంతకం చేసింది. న్యూఢిల్లీలో సౌత్ బ్లాక్లోని ఆర్మీ స్టాఫ్ వైస్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎన్.సి.రాజా సుబ్రమణి సమక్షంలో 'జనరేషన్ ఆఫ్ క్వాంటం సెక్యూర్ కీ (క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్-క్యూకెడి)' కొనుగోలు దిశగా మెస్సర్స్ 'కును' (క్యుయుఎన్యు) ల్యాబ్స్ సంస్థతో ఈ ఒప్పందం కుదిరింది. 'ఐడెక్స్' నిర్వహించిన 'సార్వత్రిక పోటీ 2.0'లో 200 కిలోమీటర్ల 'సింగిల్ హాప్ క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్' సాంకేతికతను 'కును' ల్యాబ్స్ ప్రతిపాదించింది. 'అల్గరిథమ్-ఆధారిత ఎన్క్రిప్షన్ సిస్టమ్'ల స్థానంలో ఈ సాంకేతికత వినియోగంలోకి వస్తుంది. తద్వారా మానవశక్తి సామర్థ్య గరిష్ఠం కావడంతోపాటు మరింత భద్రతకు భరోసా ఉంటుంది.

గౌరవనీయ ప్రధానమంత్రి 'డిఫెన్స్ ఎక్స్పో ఇండియా-2018' సందర్భంగా ఏప్రిల్ 12న 'ఐడెక్స్'ను ప్రారంభించారు. విద్యా, పరిశోధన-అభివృద్ధి సంస్థలతోపాటు 'ఎంఎస్ఎంఇ'లు, అంకుర సంస్థలు సహా వ్యక్తిగత ఆవిష్కర్తలను ఈ వ్యవస్థ ఒక వేదికపైకి తెస్తుంది. తద్వారా 'డిఫెన్స్-ఏరోస్పేస్' రంగంలో సాంకేతిక ప్రగతిని, ఆవిష్కరణలను ప్రోత్సహించే వాతావరణ రూపకల్పన లక్ష్యంగా 'ఐడెక్స్' కృషి చేస్తుంది. ఇందులో భాగంగా పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాల కోసం వాటికి ఆర్థిక సహాయం, నిధుల మంజూరుతోపాటు ఇతరత్రా మార్గాల్లోనూ చేయూతనిస్తుంది. భవిష్యత్తులో భారత 'డిఫెన్స్-ఏరోస్పేస్ ఆర్గనైజేషన్' (డిఐఒ) అవసరాలకు తగిన ఆవిష్కరణ లకు రూపమిచ్చే సామర్థ్యం వీటికుంది. కాగా- అంకుర సంస్థలతో, ఆవిష్కర్తలతో సముచిత సంబంధాలు ఏర్పరచుకోవడంలో 'డిఐఒ' పరిధిలోని 'ఐడెక్స్' అగ్రభాగాన నిలిచింది. ముఖ్యంగా రక్షణ రంగ అంకుర సంస్థల సమూహంలో గణనీయ ఉరవడిని ప్రేరేపించింది.

'ఐడెక్స్' పరిధిలో ప్రస్తుతం కృత్రిమ మేధ సంబంధిత 74 ప్రాజెక్టులున్నాయి. ఇవన్నీ 'ఏసింగ్ డెవలప్మెంట్ ఆఫ్ ఇన్నొవేషన్ టెక్ విత్ ఐడెక్స్' (అదితి), 'డిఫెన్స్ ఇండియా స్టార్టప్ ఛాలెంజ్' (డిఐఎస్సి), 'ఓపెన్ ఛాలెంజ్ స్కీమ్'లో అంతర్భాగంగా ఉన్నాయి. వీటిద్వారా 77 అంకుర సంస్థలకు చేయూత లభిస్తోంది. ఈ సంస్థలు భారత సైన్యం కోసం అత్యాధునిక ఆవిష్కరణలను రూపొందిస్తాయి. ఈ నేపథ్యంలో వివిధ 'ఐడెక్స్' పథకాల కింద ఇప్పటికే అందిన నాలుగు పరికరాలను భారత సైన్యం క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా వినియోగిస్తోంది. ఈ ఫలితాల ప్రాతిపదికన అంకుర సంస్థల ద్వారా తదుపరి తరం వినూత్న సాంకేతిక పరిజ్ఞాన నమూనాల రూపకల్పనలో ముందడుగు పడుతుంది.

# తిరుపతిని కేంద్రపాలిత ప్రాంతం చేయాలి!

– సుప్రీంకోర్టులో కెఏ. పాల్ పిటిషన్

న్యూ డిల్లీ అక్టోబర్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తిరుపతిని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఏ. పాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ? తిరుమల లడ్డూ వివాదంపై సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. కేవలం 744 మంది క్యాథలిక్స్ ఉండే వాటికన్ సిటీ ప్రత్యేక దేశంగా ఉందని, కోట్లాది మంది భక్తులు వచ్చే తిరుపతిని కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుమల లడ్డూ వివాదాన్ని సిఎం చంద్రబాబు జనంలోకి తీసుకొచ్చారని పాల్ విమర్శించారు. లడ్డూ నాణ్యతపై జులై నెలలో ల్యాబ్ రిపోర్ట్ వస్తే? దాని గురించి సెప్టెంబర్ లో మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణలో మధ్యంతర ఉత్తర్వులను కోరుతూ పిటిషన్ వేశానని కెఏ. పాల్ తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వంటి నేతలు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. వీరు లడ్డూ గురించి మాట్లాడకుండా ఆదేశాలు జారీ చేయాలని తన పిటిషన్ లో కోరానని వెల్లడించారు. లడ్డూలో కల్తీ జరగకుండానే జరిగిందని చెబుతున్నారని? భక్తుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు.

# గోదావరి తీరంలో మహిళా మృతదేహం..

ఆదిలాబాద్, అక్టోబర్ 1: మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం కోటపల్లి మండలం దేవులవాడ గోదావరి ఒడ్డున గుర్తు తెలియని మహిళా మృతదేహన్ని అటు వైపు వెళ్ళిన గ్రామస్తులు గుర్తించి కోటపెల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్సై రాజేందర్ సిబ్బందితో చేరుకొని ఆ మహిళ ఎవరనేది ఘటన వివరాలను సేకరిస్తున్నారు.

# జగన్ పాలనలో రాయలసీమలో విధ్వంసం - చంద్రబాబు

21 మంది ఎంపీలే రాష్ట్రానికి సంజీవని.
-దీపావళికి మూడు సిలిండర్లు
-మహిళలకు చంద్రబాబు కానుక.
-పుచ్చకాయల మాడ గ్రామంను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.
-త్వరలో మద్యం పాలసీ అమలు
-ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం.
-గుండ్రేవుల, వేదవతిని పూర్తిచేస్తాం.
-ఓర్వకల్లును ఇండస్ట్రీస్ హబ్ గా తీర్చిదిద్దుతాం.
-పత్తికొండలో టమోటో జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తాం.
-ప్రతి ఇంటిపైన సోలార్.
-యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానీ.
-జగన్ హయంలో రాయలసీమలో విధ్వంసం
-రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు.
-అయినా బెదిరేది లేదు గాడిలో పెడతా.
-గత ప్రభుత్వంలో 10 లక్షల కోట్ల అప్పు చేశారు.
-వాటికి లక్ష కోట్లు వడ్డీలకే సరిపోతుంది
-పుచ్చకాయ మడల గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.




కర్నూల్ , అక్టోబర్ 1: గత ఎన్నికల్లో ప్రజలు గెలిపించిన 21 మంది ఎంపీలే రాష్ట్రానికి సంజీవిని అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయకొండ గ్రామంలో మంగళవారం ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురు లబ్దిదారుల ఇంటికి వెళ్లి పించన్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్‌ను రూ.4 వేలకు పెంచామని గుర్తు చేశారు. ఒకటో తేదీన అధికారులు మీ ఇంటికొచ్చి పింఛను ఇస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రక్రియ ఇకపై కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఉద్యోగులకు జీతాలు సరిగా వచ్చేవి కావని.. జగన్ వెళ్తూ.. వెళ్తూ ఖజానా ఖాళీ చేసి వెళ్లారంటూ మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదని.. ఇకపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ దౌర్జన్యాలకు పెట్టుబడిదారులు పారిపోయారని.. తాము పెట్టుబడులు తీసుకువస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

గత ఐదేళ్లలో అధికార యంత్రాంగం నిర్వీర్యం అయిందన్నారు. జగన్ వెళ్తూ.. వెళ్తూ రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారంటూ ఫైర్ అయ్యారు. 10 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. ఇందుకు ప్రతినెల లక్ష కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు. 22ఏ పేరుతో భూములు దోచుకున్నారు. మీరు గెలిపించిన 21 మంది ఎంపీలే నేడు మన రాష్ట్రానికి సంజీవనిలా మారారు. వాళ్లు లేకుంటేఎంత కష్టపడినా ఉపయోగం ఉండేది కాదన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం 22ఏ పేరుతో భూములన్నీ దోచుకున్నారని, పాసు పుస్తకాల మీద కూడా వారి బొమ్మలు వేసుకున్నారని మండిపడ్డారు. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని, ఆ భూములపై త్వరలోనే సర్వే చేస్తామన్నారు. జీఎస్‌తో మీ ప్రజల భూములు వారికి అప్పగిస్తామన్నారు.

గతంలో ఉన్న నాసిరకం మద్యాన్ని కాదని మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చామన్నారు. కొత్త మద్య విధానంతో శెట్టిబలిజ, ఈడిగ , గౌడలకు 10శాతం రిజర్వేషన్లుకల్పిస్తామన్నారు. రూ.100 కోట్లతో మద్యం మాన్పించే కార్యక్రమం చేపడతామని మహిళలకు హామీ ఇచ్చారు. భర్తలకు మద్యం మాన్పించే బాధ్యత భార్యలదేనన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ పంపిణీని దీపావళి రోజు

ప్రారంభించనున్నట్లు చెప్పారు.. కర్నూలులోహైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామన్నారు.త్వరలోనే కర్నూలు నుంచి బళ్లారికి జాతీయ రహదారి తెస్తామని సీఎం రాయలసీమ ప్రజలకు హామీ ఇచ్చారు.

రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరివ్వాలనది నా లక్ష్యమని పేర్కొన్నారు. 2047నాటికి ఏపీని దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా పాలన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం మీటింగ్ అంటే పరదాలు కట్టేవారు.. చెట్లు కొట్టేసేవారు..సీఎం మీటింగ్ అంటే ప్రజలకు నరకం కనిపించేది..ఇప్పుడు అలాంటి అసౌకర్యాలు లేకుండా ప్రజలందరి సమక్షంలో మీటింగ్ జరుపుకునే స్వేచ్ఛ వచ్చిందని చెప్పుకొచ్చారు.

రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు, ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలనేది తన అభిమతమని అన్నారు చంద్రబాబు. గండ్రేవుల , గురు రాఘవేంద్ర, ఆర్డీఎస్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్ గా మార్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అందులో భాగంగానే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పానని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

వాలంటీర్లు లేకుండా ఎలాంటి పని కాదని వైసీపీ నేతలు మాట్లాడారని.. కానీ వారు లేకుండానే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వాలంటీర్లను ఏం చేయాలో ఆలోచిస్తున్నామని చెప్పారు. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్ గా మారుస్తామన్నారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కర్నూలు పుచ్చకాయ మడ గ్రామంలో వర్క్ ఫ్రం హోంకు శ్రీకారం చుట్టాలనేదే తన ఆలోచన అన్నారు. గ్రామాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సొంతూరిలోనే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చని చెప్పారు.

## వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసం

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదని చంద్రబాబు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మీటింగ్స్ అంటే పరదాలు కట్టేవారని.. చెట్లను నరికేసేవారని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు.సీఎం మీటింగ్ అంటేనే ప్రజలకు నరకం కనిపించేదని అన్నారు. . ఎన్నికల్లో ఎంతో చైతన్యంతో ఓటు వేశారు. జగన్ వెళ్తూ వెళ్తూ ఖజానా ఖాళీ చేసి వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలను నెరవేరుస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఒక్క ఎకరాకు నీరివ్వలేదు. పైసా ఖర్చు లేకుండా రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తాం. గత ప్రభుత్వంలో చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఇప్పటికే రద్దు చేశామన్నారు. రీసర్వే పేరుతో ప్రజల భూముల సరిహద్దులు చెరిపేశారు. వాటిని సరి చేస్తున్నాం. భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాం. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలనేదే నా లక్ష్యం. అని చంద్రబాబు పేర్కొన్నారు.

# థీమాటిక్ హబ్స్, టెక్నికల్ గ్రూప్స్ జాతీయ క్వాంటమ్ ఏర్పాటును ప్రకటించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: జాతీయ క్వాంటమ్ కార్యక్రమమనేది కేవలం క్వాంటమ్ కార్యక్రమం మాత్రమే కాదు. అంతకంటే ఎక్కువ అని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ అన్నారు. ఇది దేశ భవిష్యత్తుకోసం వ్యూహాత్మక పెట్టుబడి. ఆర్థిక వృద్ధికోసం పునాది వేస్తుంది, ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది. అంతే కాదు క్వాంటమ్ ఆధారిత ప్రపంచంలో సాంకేతికపరమైన నాయకత్వం చేపట్టడానికి దేశానికి ఉపయోగపడుతుంది అని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. థీమాటిక్ కేంద్రాలు, జాతీయ క్వాంటమ్ కార్యక్రమ ( ఎన్ క్యూ ఎం) సాంకేతిక బృందాల ప్రకటన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ( స్వతంత్ర బాధ్యత), భూ విజ్ఞానశాఖ (స్వతంత్ర బాధ్యత), ప్రధాని కార్యాలయ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. 17 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలలో 14 సాంకేతిక బృందాల (17 ప్రాజెక్ట్ టీమ్‌లు)తో కూడిన నాలుగు థీమాటిక్ హబ్‌లను (టి-హబ్‌లు) ఏర్పాటు చేయడాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. ఈ హబ్‌లు 43 సంస్థలకు చెందిన మొత్తం 152 పరిశోధకులను ఏకతాటిపైకి తీసుకొస్తాయి. వీటిలో 31 జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు, 8 పరిశోధనా ప్రయోగశాలలు, ఒక విశ్వవిద్యాలయం 3 ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి.వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం సాంకేతికతల రంగంలో దేశం అగ్రగామిగా ఉండాలనే ఐక్యతాపూర్వక ఆశయాన్ని ఈ కార్యక్రమం ప్రతిఫలిస్తోందని మంత్రి అన్నారు.

" ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ -2047 సాధనలో ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆవిష్కరించిన దార్శనికతను సాకారం చేయడంలో జాతీయ క్వాంటమ్ కార్యక్రమం కీలకమైంది.భవిష్యత్తును తీర్చిదిద్దే క్వాంటమ్ సాంకేతికతలల్లో అత్యాధునికమైనదాన్ని సాధించాలనే భారత్ సంకల్పాన్ని జాతీయ క్వాంటమ్ కార్యక్రమం ప్రతిఫలిస్తోంది" అని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రత్యేకంగా తన ప్రసంగంలో పేర్కొన్నారు. .

ప్రధానమంత్రి శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణ సలహా మండలి ( పిఎంఎస్ టీ ఐఏసీ) కింద ఉన్న తొమ్మిది కార్యక్రమాల్లో ఎన్ క్యూ ఎం ఒకటి. శాస్త్రీయ పరిశోధనలను ప్రభావితం చేయడానికి, క్వాంటమ్ సాంకేతికతల రంగంలో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా మార్చడానికి ఎన్ క్యూ ఎం రూపొందింది.. సురక్షితమైన క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్ , ప్రెసిషన్ సెన్సింగ్ టెక్నాలజీ లను అభివృద్ధి చేయడం ద్వారా, టెలికమ్యూనికేషన్స్, రక్షణ రంగం, ఆర్థికరంగం, ఇంకా ఆరోగ్య భద్రత వంటి రంగాలలో విప్లవాత్మక మార్పులకోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇది శాశ్వత సామాజిక ప్రభావాన్ని చూపే కార్యక్రమం.

మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్న ఈ డైనమిక్ టి-హబ్‌ల ముఖ్య బలాలలో ఒకటి, వాటి బహుళ-క్రమశిక్షణా విధానం. ఇది భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ , మెటీరియల్ సైన్స్ వంటి విభిన్న రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేరుస్తుంది. తద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం కలిసి పనిచేసేలా చేసి క్వాంటమ్ టెక్నాలజీలో సంపూర్ణ పురోగతిని సాధించడానికి దోహదం చేస్తుంది.

పరిశోధనలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇక్కడ అభివృద్ధి చేసే ఆవిష్కరణలు మార్కెట్‌లో స్పష్టమైన పురోగతికి దోహదం చేస్తాయి. టెలికమ్యూనికేషన్స్, రక్షణ రంగం, సెన్సింగ్ అండ్ మెట్రాలజీ, ఆరోగ్య భద్రత వంటి రంగాలకు ప్రయోజనం చేకూరుస్తాయి.

అంకుర సంస్థలకు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవసరమైన కీలక మద్దతును ఎన్ క్యూ ఎం అందిస్తుంది. క్వాంటమ్ -ఆధారిత ఆవిష్కరణల కోసం శక్తిమంతమైన ఆవరణ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. మనదేశం క్వాంటమ్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవ్యవస్థకు కేంద్రంగా మారేలా దోహదం చేస్తుంది. ఈ కార్యక్రమం ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న క్వాంటమ్ సాంకేతిక రంగాలలో ఉద్యోగాలను కల్పిస్తుంది. భవిష్యత్తులో రాబోయే ఉద్యోగాల తీరును పసిగడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్ , మెటీరియల్ సైన్స్-రంగాలలో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేస్తుంది.

'మేక్ ఇన్ ఇండియా, 'డిజిటల్ ఇండియా' వంటి ఇతర జాతీయ కార్యక్రమాలతో ఎన్ క్యూ ఎంను పటిష్టం గా అనుసంధానించామని, క్లిష్టమైన అంశాలలో సాంకేతిక స్వావలంబనను ప్రోత్సహించడం, ప్రపంచ సాంకేతిక అభివృద్ధిలో దేశం అగ్రగామి అయ్యేలా కృషి చేస్తామని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

దేశ క్వాంటమ్ ఆవరణ వ్యవస్థకు చెందిన స్థిరమైన వృద్ధి దీర్ఘకాలంగా కొనసాగేలా ఎన్ క్యూ ఎంను రూపొందించారు. ఇది సామర్థ్యాన్ని పెంపొందించడం, పరిశోధనలకు నిధుల్ని సమకూర్చడం, దేశ సాంకేతిక సామర్థ్యాలపై శాశ్వత ప్రభావాన్ని కలిగించడంపై దృష్టి సారిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

నేషనల్ క్వాంటమ్ మిషన్ విజయవంతానికి విద్యారంగ సంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు కలిసికట్టుగా పని చేయాలని దేశం ప్రపంచ క్వాంటమ్ సూపర్ పవర్‌గా ఎదిగేలా కృషి చేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. మనందరం కలిసికట్టుగా పని చేసి క్వాంటమ్ ఆవిష్కరణల్లో ప్రపంచానికే భారత్ నేతృత్వంవహించేలా చేద్దాం.. ప్రపంచ వేదికపై శాస్త్రీయ ఆవిష్కరణల్ని, పారిశ్రామిక మార్పులను భారత్ నిర్దేశించేలా చూద్దాం అని మంత్రి తన ప్రసంగంలో పునరుద్ఘాటించారు.

భారత్ జెన్ : సాంకేతికరంగ నాయకత్వంలో ఒక మైలురాయి

యుపిఐతో పాటు వివిధ రంగాలను మార్చిన ఇతర ఆవిష్కరణల్లో భారత్ సాధించిన విజయాల మాదిరిగానే, జెనరేటివ్ కృత్రిమ మేధ ( ఏఐ) రంగంలోకూడా భారతదేశాన్ని అగ్రగామిగా చేయడానికిగాను స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేయాలి. ఈ విషయంలో దేశ నిబద్ధతకు భారత్‌జెన్ ఒక గర్వించదగిన ఉదాహరణ" అని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర వివరించారు. ఇంటర్ డిసిప్లినరీ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్‌కు సంబంధించిన జాతీయ కార్యక్రమం భారత్‌జెన్ ను ప్రారంభించిన సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు.

ప్రభుత్వ-నిధులతో కూడిన ప్రపంచంలోనే మొట్టమొదటి మల్టీమోడల్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ప్రాజెక్ట్‌గా ఈ కార్యక్రమాన్ని గుర్తించారు. ఇది భారతీయ భాషలలో సమర్థమంతమైన , సమగ్రమైన ఏఐని రూపొందించడంపై దృష్టి పెట్టింది. భారత్ జెన్ కార్యక్రమంలోని కీలక అంశం దాని ఓపెన్ సోర్స్ ఫౌండేషనల్ మోడల్స్. ఇవి దేశమంతటా ఏఐని అందుబాటులోకి తేవడానికి సహాయపడుతాయి. ఏఐని మరింతగా అందుబాటులోకి తేవడం ద్వారా, ఒక సహకారావరణ వ్యవస్థ ఏర్పడుతుంది. ఇందులో పరిశోధకులు , డెవలపర్‌లు కలిసి వినూత్న పరిష్కారాలను కనుగొంటారు.

భారత్ జెన్ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్ సాధనకోసం ప్రత్యక్షంగానే కృషి చేస్తుంది. ఎందుకంటే మనం కేవలం వినియోగదారులం మాత్రమే కాదు.. మన దేశ విభిన్న అవసరాలను, సంస్కృతులను ప్రతి ఫలించేలా వినూత్న ఏఐ నిర్మాతలం అని మంత్రి తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

దేశ భాషలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించిన మంత్రి , భారత్‌జెన్ కార్యక్రమం సామాజిక సమానత్వానికి ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలను గౌరవించుకుంటూనే, వారికి ప్రయోజనం జరిగేలా ఏఐ పనిచేస్తుందని మంత్రి అన్నారు.

'మేక్ ఏఐ ఇన్ ఇండియా, మేక్ ఏఐ ఫర్ ఇండియా కోసం దేశం కనబరుస్తున్న నిబద్ధతను మంత్రి తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రజా సంక్షేమానికి మద్దతుగా రూపొందించిన భారత్‌జెన్‌ను ఒక పరిపూర్ణ ఉదాహరణగా పేర్కొన్నారు. సమూల మార్పులను తీసుకురాగలిగే శక్తిని కలిగిన ఏఐ నుంచి ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందుతారంటూ తన ప్రసంగంలో భరోసానిచ్చారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ప్రయోగాత్మక సర్వేను పక్కాగా జరిపించాలి

## - కలెక్టర్లతో మంత్రి పొంగులేటి, సీ.ఎస్ శాంతికుమారి వీ.సీ సమీక్ష.




నంగారెడ్డి అక్టోబర్ 1(నేటి నిజం ప్రతినిధి)రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రయోగాత్మకంగా ఈ నెల 3 వ తేదీ నుండి పైలెట్ ప్రోగ్రామ్ కింద చేపట్టనున్న ప్రయోగాత్మక సర్వేను పక్కాగా జరిపించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే, నగరాలు, పట్టణ ప్రాంతాల విస్తరణకై ప్రతిపాదనలు, భూముల క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల సత్వర పరిష్కారం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం అర్హులైన లబ్దిదారుల ఎంపిక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి, సీ.ఎస్ శాంతికుమారి సమీక్ష జరిపారు.

డిజిటల్ కార్డుల జారీకై ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు గ్రామాలలో ప్రయోగాత్మక సర్వే నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజకవర్గాలైతే రెండు వార్డులు/డివిజన్లను ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించాలని, ఈ నెల 8 వ తేదీ నాటికి సర్వేను పూర్తి చేయాలని అన్నారు. 9 న స్క్రూటినీ జరిపి, 10 వ తేదీన సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదిక పంపించాలని కలెక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా సర్వేను పకడ్బందీగా జరిపించాలని, ఆర్డీఓ/ మునిసిపల్ కమిషనర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి క్షేత్రస్థాయిలో సర్వే తీరును నిశితంగా పరిశీలన చేయాలన్నారు.

సర్వే సందర్భంగా ఫ్యామిలీ ఫోటోను సేకరించడం తప్పనిసరి కాదని, ఫోటో కోసం ఎవరిని కూడా ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు.

ప్రతి రోజు ఒక్కో బృందం 30 నుండి 40 కుటుంబాలకు సంబంధించిన సర్వేను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకుని, గడువు లోపు పైలెట్ సర్వేను పూర్తి చేయించాలని అన్నారు. ఆయా ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందేందుకు సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికి డిజిటల్ కార్డులను జారీ చేయనున్నందున ఇంటింటి పరిశీలనను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

పైలెట్ సర్వే పూర్తయిన మీదట రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పైలెట్ సర్వే ప్రక్రియను తీరును పరిశీలించేందుకు ఒక్కో ఉమ్మడి జిల్లాకు ఒక స్పెషల్ ఆఫీసర్ చొప్పున రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాలలో పర్యటిస్తారని అన్నారు.

కాగా, భూముల క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని, నిబంధనలకు లోబడి ఉన్న దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను దసరా కానుకగా అర్హులైన వారికి కేటాయించేందుకు గాను లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు.

లబ్దిదారుల ఎంపికకు సంబంధించిన విధివిధానాలను ఒకటిరెండు రోజుల్లోనే పంపిస్తామని, ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారుల జాబితాను రూపొందించాలని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ కోసం విరివిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ఈ నెల 15 వ తేదీ నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని తప్పనిసరి ప్రారంభించాలని, ధాన్యం దిగుబడులను అనుసరిస్తూ అన్ని ప్రాంతాలలో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ వర్తింపజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ప్రతి కేంద్రంలోనూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి సమస్యలు, ఇబ్బందులకు తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు.

మంత్రి పొంగులేటి, సీ.ఎస్ శాంతికుమారి లతో కలిసి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రాష్ట్ర సచివాలయం నుండి వీడియో సమీక్ష లో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం నుండి అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డి పి ఓ సాయిబాబా, మునిసిపల్ కమిషనర్లు, ఆర్ డి ఓ లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తొలిసారిగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన బహుళ విధ, విస్తృత భాషా నమూనా కార్యక్రమం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: భారత్ జెన్ పేరుతో అద్భుత కృత్రిమ మేధ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. కృత్రిమ మేధ ద్వారా భాష, సంభాషణలకు సంబంధించి పలు మౌలిక నమూనాలను రూపొందించి ప్రజాసేవలను విప్లవాత్మకం చేయడం, చిత్రాలు, వీడియోలలోని అంశాలను కంప్యూటర్లు అర్థం చేసుకునే నమూనాలను (కంప్యూటర్ విజన్) రూపొందించడం ద్వారా ప్రజలు వీటిని మరింత విరివిగా వాడేట్లు చేయడం దీని లక్ష్యం. కేంద్ర శాస్త్ర సాంకేతిక (స్వతంత్ర), భూ విజ్ఞాన శాస్త్ర, ప్రధానమంత్రి కార్యాలయ, అణు ఇంధన , అంతరిక్ష ,సిబ్బంది, ప్రజాఫిర్యాదులు పెన్షన్ల శాఖ సహాయమంత్రి శ్రీ జితేంద్ర సింగ్ దృశ్య మాధ్యమం ద్వారా న్యూఢిల్లీలో ఈరోజు దీనిని ఆవిష్కరించారు.

"దేశీయ సాంకేతికతను మరింత ముందుకు తీసుకువెళ్లాలన్న భారత్ కృతనిశ్చయానికి భారత్ జెన్ ఒక సగర్వ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇది మన దేశాన్నిజనరేటివ్ కృత్రిమ మేధ రంగంలో (అంటే,సందేశాలు, చిత్రాలు సంగీతం, ఆడియో,వీడియోలను ఉపయోగించి వినూత్న విషయాలను క్రోడీకరించే రంగంలో) అంతర్జాతీయ నాయకత్వ స్థానంలో నిలబెడుతుంది. గతంలో వివిధ రంగాలలో పెనుమార్పులకు కారణమైన యుపిఐ వంటి వినూత్న ఆవిష్కరణలు, సాంకేతికతల లాగే ఇది పెనుమార్పులకు దారితీస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం, ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన బహుళ విధ విస్తృత భాషా నమూనా కార్యక్రమమని ఆయన అన్నారు.ఇది భారతీయ భాషలలో సమ్మిళిత, సమర్థ కృత్రిమ మేధకు వీలుకల్పించడంపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. శాస్త్ర సాంకేతిక విభాగానికి చెందిన, అంతర్ విభాగాల సైబర్ ?భౌతిక వ్యవస్థల జాతీయ కార్యక్రమం కింద ఐఐటి బొంబాయి దీనికి నాయకత్వం వహిస్తోంది. ఈ కార్యక్రమం కింద ఎఐ వ్యవస్థలు వివిధ భారతీయ భాషలలో అత్యంత నాణ్యమైన సమాచారాన్ని, బహువిధ అంశాలను రూపొందించ గలుగుతాయి. ఈ ప్రాజజెక్టును ద ఫౌండేషన్ ఫర్ ఐఒటి, ఐఒటి బొంబాయి లోని ఐఓఈ లు అమలు చేస్తాయి. దీనికి విద్యావిషయక భాగస్వాములుగా ఐఐటి బొంబాయి, ఐఐఐటి హైదరాబాద్, ఐఐటి మండి, ఐఐటి కాన్పూర్, ఐఐటి హైదరాబాద్, ఐఐఎం ఇండోర్, ఐఐటి మద్రాస్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు వ్యవహరిస్తాయి. వీటి తోడ్పాటుతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తారు.

ఈ కార్యక్రమంలో ఐఐటి బొంబాయి డైరక్టర్, ప్రొఫెసర్ శిరీష్ కేదారే, ప్రొఫెసర్ గణేశ్ రామకృష్ణన్ నాయకత్వంలో కన్సార్టియంకు చెందిన పలువురు ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ జెన్, వినూత్న కృత్రిమ మేధ నమూనాలను, వాటి అప్లికేషన్లను ప్రజోపయోగం కోసం రూపొందిస్తుంది. ఇది దేశ సామాజిక సాంస్కృతిక, భాషాపరమైన వైవిధ్యతకు ప్రాధాన్యతనిస్తుంది. దేశ అవసరాలైన సామాజిక సమానత్వం, సంస్కృతీ పరిరక్షణ, భాషా వైవిధ్యతకు సంబంధించిన అవసరాలను తీరుస్తూ, సమాజంలోని అన్ని వర్గాల వారికి కృత్రిమ మేధ ద్వారా వినూత్న ఆవిష్కరణలను అందేట్టు చేయడం దీని లక్ష్యం.

దేశంలోని పౌరులందరికీ కృత్రిమ మేధను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో భారత్ జెన్ ను తీర్చిదిద్దారు. కృత్రిమ మేధ అనేది కేవలం పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు మాత్రమే అన్న రీతిలో కాకుండా, జాతీయ ప్రాధాన్యతలైన సంస్కృతీ పరిరక్షణ, సమ్మిళిత సాంకేతిక అభివృద్ధి వంటి అవసరాలను తీర్చే లక్ష్యంతో రూపొందించినట్టు డి ఎస్ టి కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరండికర్ తెలిపారు.

భారత్ జెన్ అనేది, నాలుగు కీలక అంశాలతో కూడినది. అవి, బహుబాషలు, బహువిధ మౌలిక నమూనాలు, భారతీయ డాటా సెట్ ఆధారిత వ్యవస్థ, శిక్షణ, ఓపెన్ సోర్స్ ప్లాట్ఫారం, దేశంలో వినూత్న కృత్రిమ మేధ ఆవిష్కారాలకు సంబంధించిన వాతావారణాన్ని అభివృద్ధి చేయడం. ఈప్రాజెక్టు రెండు సంవత్సరాలలో పూర్తి కాగలదని అంచనా. దీనివల్ల పలు ప్రభుత్వ, ప్రైవేటు,విద్యా , పరిశోధన సంస్థలు ప్రయోజనం పొందనున్నాయి.

భారత్ జెన్ అక్షర రూపాలు, సంభాషణలు రెండింటికీ పనికివస్తుంది. ఇది దేశంలోని వివిధ భాషలకు వర్తిస్తుంది. బహుళ భాషలకు సంబంధించిన సమాచారంపై శిక్షణ ద్వారా ఇది భారతీయ భాషల సూక్ష్మ మెళకువలను గ్రహిస్తుంది. ఇతర నమూనాల లాగా అంతర్జాతీయ నమూనాలపై ఆధారపడడం కాక, భారత్ జెన్, సమాచార సేకరణలో భారతదేశ కేంద్రిత సమాచారాన్నిఅంటే, భిన్న భాషలు, మాండలికాలు, సాంస్కృతిక నేపథ్యాలు కచ్చితంగా ప్రతిబింబించే విధంగా చూస్తుంది. ఈ రకమైన సమాచార సార్వభౌమత్వం, మన దేశం తన డిజిటల్ వనరులపై, తనదైన కథనాలపై నియంత్రణ కలిగి ఉండడానికి వీలు కలుగుతుంది.

భారత్ జెన్ , దేశ ఆత్మనిర్భర భారత్ దార్శనికతకు అనుగుణమైనది. ఇది దేశ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా కృత్రిమ మేధకు సంబంధించిన మౌలిక నమూనాలను అభివృద్ధి చేస్తుంది. ఇండియాలోనే ఎఐ సాంకేతికతలను అభివృద్ధి చేయడం ద్వారా ఇతర దేశాల సాంకేతికతలపై ఆధారపడడాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఇది దేశీయంగా కృత్రిమ మేధకు సంబంధించి పరిశ్రమలు, అంకుర పరిశ్రమలు, ప్రభుత్వ ఏజెన్సీలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుంది. మౌలిక నమూనాల ద్వారా కృత్రిమ మేధను అందరికీ అందుబాటులోకి తేవడం ద్వారా దీనిని ప్రజాస్వామీకరించడానికి వీలు కలుగుతోంది. అలాగే, సవివరమైన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇది కృత్రిమ మేధ అప్లికేషన్లను ,ఆవిష్కర్తలు, పరిశోధకులు, అంకుర పరిశ్రమలు సత్వరం చౌకగా రూపొందించడానికి దోహదపడుతుంది. అంతగా డిజిటల్ రంగంలో లేని భారతీయ భాషలను డాటా సమర్థతతో అధ్యయనం చేయడానికి భారత్ జెన్ వీలు కల్పిస్తుంది. ఈ రంగంలో విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తుంది, మౌలిక పరిశోధన ద్వారా అంతర్జాతీయ కృత్రిమ మేధ చర్యలలో అంతంతమాత్రంగా కనిపించే భాషలకు అత్యంతావశ్యకమైన కనీస డాటాను ఇది సమకూరుస్తుంది. భారత్ జెన్ అత్యంత సమర్థతతో కూడిన కృత్రిమ మేధ పరిశోధక బృందాన్నితీర్చిదిద్దుతుంది. తగిన శిక్షణ కార్యక్రమాలు, హాకథాన్లు, అంతర్జాతీయ నిపుణుల సహకారంతో దీనిని సాకారం చేస్తుంది. భారత్ జెన్ 2026 జూన్ వరకు తన కీలక కార్యకలపాల మార్గసూచిని ముందస్తుగానే రూపొందించుకుంది. ఇందులో కీలకమైనవి, కృత్రిమ మేధ నమూనాల అభివృద్ధి, ప్రయోగాలు, దేశ అవసరాలకు తగిన రీతిలో కృత్రిమ మేధ ప్రమాణాల రూపకల్పన వంటివి ఉన్నాయి. భారత్ జెన్ , వివిధ పరిశ్రమలలో కృత్రిమ మేధను మరింత ఉన్నతస్థాయిలో వినియోగించే విధంగా చూడడం, ఆదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టేలా చూడడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి.

# "వయోవృద్ధుల సంరక్షణ బలోపేతం" పై జాతీయ వర్క్‌షాప్ నీతి ఆయోగ్ స్టేట్ సపోర్ట్ మిషన్ (ఎస్ఎస్ఎమ్) ఆధ్వర్యంలో కార్యక్రమం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: నీతి ఆయోగ్ సెప్టెంబర్ 27న కేరళలోని తిరువనంతపురంలో "భారతదేశంలో వయోవృద్ధుల సంరక్షణ బలోపేతం" పై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించింది. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఎస్‌జేఈ), భారత ప్రభుత్వం, సామాజిక న్యాయం, సాధికారత విభాగం, కేరళ ప్రభుత్వ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. వయోవృద్ధుల సంరక్షణలో అంతరాలు, సవాళ్లపై రాష్ట్రాలు, ఇతర వాటాదారుల అభిప్రాయాలను సేకరించడం, అలాగే రాష్ట్రాలు, ఇతర వాటాదారులు అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను గురించి తెలుసుకుని సందర్భోచితంగా వాటిని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేయడం ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం.నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్. వి.కె. పాల్ అధ్యక్షత వహించిన ఈ ఒకరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను కేరళ ప్రభుత్వ ఉన్నత విద్య, సామాజిక న్యాయశాఖా మంత్రి డాక్టర్ ఆర్. బిందు ప్రారంభించారు. శ్రీమతి శారదా మురళీధరన్, కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహా, కేరళ, ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పలు మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు, అలాగే పీఎఫ్ఆర్‌డీఏ, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూహెచ్ఓ ఇండియా, ఐఆర్‌డీఏఐ సహా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు చెందిన ఆయా రంగాల ప్రముఖులు, సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేట్ సపోర్ట్ మిషన్ (ఎస్ఎస్ఎమ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఐటీఐ-స్టేట్ వర్క్‌షాప్ శ్రేణిలో భాగంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించారు.ప్లీనరీ చర్చా కార్యక్రమంలో, వర్క్‌షాప్ ఉద్దేశ్యాన్ని వివరించడం కోసం నీతి ఆయోగ్ ఒక సంక్షిప్త ప్రజెంటేషన్ అందించింది. అనంతరం "వయోవృద్ధుల సంరక్షణ కోసం విధానపరమైన సంస్కరణలు: కేరళ అనుభవాల వివరణ" గురించి కేరళ ప్రభుత్వం వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చింది. దీనిలో భాగంగా వయోవృద్ధుల సంరక్షణ సంబంధిత ఇబ్బందులను పరిష్కరించడం కోసం కేరళ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రధానంగా ప్రస్తావించారు.





# తెలంగాణలో ఈ రోజునుంచి పూల జాతర !



పూలతో మనం దేవుణ్ణి పూజిస్తాము.
సన్మానాలకు సేత్కారాలు విరివిగా పూలను వినియోగిస్తాము.
మన ఇళ్లలో జరిగే వివాహది శుభకార్యాలకు, పండుగలకు, పబ్బాలకు అలంకరణలకు పువ్వులను ఎంతగాఉపయోగిస్తామో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అలాంటి “పువ్వులనే పూజించే” గొప్ప సాంప్రదాయం మన తెలగాణ రాష్ట్రానికి ప్రత్యేకమని చెప్పుకోవచ్చు.

మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక గా నిలిచి,ప్రకృతితో అనుబంధాన్ని ప్రస్ఫుటం చేసే “బతుకమ్మ పండుగ” అతివల అస్తిత్వానికి అద్దం పడుతూ ,వారి లోని సృజనాత్మకత శక్తిని లోకానికి చాడుతుంది.

పూల అమెరిక నుంచి పాటల ఆలాపన వరకు ప్రతిదీ ముగ్ధ మనోహరంగా ఆవిష్కృతమవుతుంది. ఈ పండుగ వేళ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 లో ప్రభుత్వం తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పే “బతుకమ్మపండుగను”“రాష్ట్ర పండుగ”గా ప్రకటించింది.

”తెలంగాణలో మహిళలకు ఎంతో ఇష్టమైనది ,ప్రత్యేకమైనది ఈ “పండుగ బతుకమ్మ వేడుక”

అందుకే పెళ్లయిన ఆడపిల్లలంతాబతుకమ్మ పండుగకు పుట్టింటికి రావడం అనాదికాలంగా అనవాయతిగా వస్తుంది. తల్లిగారింటిలో ఆడపడుచులు పెద్దమ్మలు, చిన్నమ్మలు ఇరుగుపొరుగు మహిళా మణులంతా కలిసి నవ్వుతూ, ఆడుతూ పాడుతూ, కోలాహలంగా జరుపుకునే పువ్వుల పండుగ ఇది.

ఈ పూల వేడుకలో తంగేడు, గునుగు, ముద్ద బంతి, చామంతి, పుట్టు కుచ్చులు మొదలైన రకరకాల పువ్వులను అందమైన ఆకృతిగా పేర్చి అందులో పసుపు గౌరమ్మను పెట్టి, ఆ బతుకమ్మను ఆదిపరాశక్తిగా పూజించి, భక్తితో పరవశించి, ఆడి పాడే పాటలు ఊరంతా మారుమోగుతాయి.



“బతికించే అమ్మ,బ్రతుకు నిచ్చే అమ్మ” అన్న ఆరాధన భావంతో అమ్మవారికి నీరాజనాలు అర్పించడం బతుకమ్మ పండుగలో అంతరార్థం.

వసంత, శరదృతువులు సంవత్సరంలో సంధికాలాలు.

సంవత్సరంలో మొదటి భాగం వసంతంతో ఆరంభమైతే, రెండో భాగం శరదృతువుతో మొదలవుతుంది. ఈ సంధి కాలాల్లో ప్రకృతిలో ఎన్నో మార్పులు వస్తాయి. ఈ మార్పుల వల్ల సూక్ష్మజీవుల ప్రాబల్యం పెరిగి, రోగకారక నేపథ్యం వాతావరణంలో కలుగుతుంది. అందుకేదేవీభాగవతం ఈ రెండు రుతువుల్ని “యముడి కోరలు”గా అభివర్ణించింది. ఆ కోరల్లో చిక్కు కొని, రోగాల బారిన పడకుండా ఉండాలంటే ఈ ఋతువులో విశేష దైవారాధన తప్పనిసరిగా చేయాలని పూర్వీకులు భావించారు. ఆ నేపథ్యంలోనే శరన్నవరాత్రుల్లో

శిష్ట సంప్రదాయంలో మంత్రపూర్వకంగా ,ఉపాసనా రీతిలో అమ్మవారి ఆరాధన జరుపుతారు.ఇందులో భాగంగానే తెలంగాణా ప్రాంతంలో జానపదులు తమ జీవనశైలికి అనుగుణంగా ఆటపాటలతో అమ్మను ఆరాధిస్తారు. ఆ అమ్మే బతుకమ్మ . ఇలా బతుకమ్మకు సంబంధించి తెలంగాణ ప్రాంతంలో చాలా కథలు ప్రచారంలో కూడా ఉన్నాయి.

పూర్వం చోళ దేశంలో ధర్మాంగదుడనేరాజువుండేవాడు.ఆయన భార్య సత్యవతి .ఆ దంపతులకు ఎన్నో నోముల ఫలితంగా వందమంది పుత్రులు కలిగి వారంతా యుద్ధంలో వీరమరణం పొందగా ,ఆవేదనతో ఆ దంపతులు జగదంబను ప్రార్థించారని, అప్పుడు జగన్మాత ప్రత్యక్షమై తానే పుత్రికగా వారి ఇంట జన్మిస్తానని,వరమిచ్చిందట .ఆ వరం ప్రకారం జగన్మాత సత్యవతికి బిడ్డగా జన్మించింది. తాను బతికి ఎన్నో బతుకులకు దారి చూపిన ఆ తల్లి బతుకమ్మ అవుతుందని .మహర్షులు ఆశీర్వదించారట.

దక్ష ప్రజాపతి వల్ల అవమానం పాలైన దాక్షాయణి అగ్నికి ఆహుతి అయితే ,మహదేవుడు వీరభద్రుని పంపి దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేశాడు .అప్పుడు యజ్ఞ గుండంలోని భస్మరాశిని శంఖాకృతిలో పేర్చి ,ఆ రూపాన్ని పూజించి, దాన్ని బతుకమ్మగా పిలిచారట .ఆనాటి నుండి పువ్వులతో అదే స్వరూపంతో బతుకమ్మను తీర్చిదిద్దడం సంప్రదాయం అయిందనేది మరో కథ. ఇలా “ముగ్గురమ్మల సమైక్య రూపం”గా వెలిగే బతుకమ్మ ఆరాధన ప్రజల సమిష్టి జీవనానికి నిదర్శనమని చెప్పుకోవచ్చు.

బతుకమ్మ పండుగను ఆధ్యాత్మిక సాధకులు సామూహిక శక్తి ఉపాసనగా “ఆత్మ చైతన్యానికి” మేలుకొలుపుగా భావిస్తారు .

తెలంగాణ ప్రాంతంలోపితృదేవతలను కొలిచే అమావాస్య పెతరమవాస్య (మహాలయ అమావాస్య) రోజు

బతుకమ్మ సంరంభం ఆరంభం అవుతుంది. ముగ్గురమ్మల అంశగానే కాకుండా ప్రకృతికి ప్రతిరూపంగా శ్రీ చక్ర శోభితగా తమ ఇంటి ముత్తైదువగా బతుకమ్మను భావించి,ఆ భావనతోటే పాటలను ఆలపిస్తారు . బతుకమ్మలను మధ్యలో ఉంచి మహిళలంతా వలయాకారంగా చుట్టూ పాటలను ఆలపిస్తూ, చెప్పట్లు కొడుతూ తిరుగుతూ ఉంటారు. ఈ దృశ్యం చూడడానికి ఎంతో అద్భుతంగా ఉంటుంది.

**“శ్రీ లక్ష్మీదేవి ఉయ్యాలో సృష్టి బతుకమ్మాయే ఉయ్యాలో”**
**“నోరు నోములు నోచ ఉయ్యాలో ఊరు మందిని గాంచె ఉయ్యాలో”**
**“ఇద్దరక్క జెల్లెండ్లు ఉయ్యాలో ఒక్కదే మాయన్న ఉయ్యాలో”**

ఇలాంటి పాటలు తొమ్మిది రోజులు ఊరురా వాడ వాడలా మారుమవుతాయి.

స్త్రీలు ఆలపించే ఈ పాటలలో సమాజంలోని వివిధ కుటుంబాల్లోని కష్టసుఖాలు,పురాణ కథలు చారిత్రక ఘట్టాలు ఆవిష్కృతమవుతాయి.

కాకతీయుల కాలంలో కూడా బతుకమ్మ పండుగ వైభవంగా జరిగిందనేది చరిత్ర ద్వారా మనకు స్పష్టమవుతుంది. తెలంగాణలో ప్రసిద్ధమైన బతుకమ్మ పండుగను పోలిన వేడుకలు ఓనం, అట్లతద్దె, కోలాటం, దాండియా ,గొబ్బెమ్మ .ఇలా నామరూప భేదాలతో దేశమంతా కనిపిస్తాయి. భక్తి సామ్రాజ్యానికి బతుకమ్మ పండుగ పెట్టని కోట లాంటిది అంటే శక్తి కాదని చెప్పొచ్చు.

పెద్దల అమావాస్య నాడు మొదలైన బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులపాటు ఉత్సాహంగా సాగి దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.

ఈ తొమ్మిది రోజులు బతుకమ్మను ఒక్కో రోజు ఒక్కో పేరుతో పిలుచుకుంటారు.

మొదటి రోజు బతుకమ్మను “ఎంగిలిపూల”బతుకమ్మ అంటారు.
2వ రోజు బతుకమని “అటుకుల బతుకమ్మ” గా,
3వరోజు “ముద్దపప్పు” బతుకమ్మగా ,
4వ,రోజు నానే బియ్యం బతుకమ్మ
5వ ,రోజు “అట్ల బతుకమ్మ”గా ,
6వ రోజు “అలిగిన బతుకమ్మ” గా వ్యవహరిస్తారు. ఈరోజు అమ్మవారు అలకపొంతుందని, మహిళలు కూడా బతుకమ్మ ఆడరు.
7వ రోజు “వేపకాయలబతుకమ్మ”గా
8వ రోజు “వెన్న ముద్దల” బతుకమ్మ గా
9వ రోజు “సద్దుల బతుకమ్మ”గా వ్యవహరిస్తారు. ప్రతి రోజూ ఆబతుకమ్మకు తగిన నైవేద్యాన్ని భక్తితో అర్పిస్తారు.

చివరగా బతుకమ్మను చెరువుగట్టుకు వెళ్లిఆ నీటిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ.

ప్రస్తుతం మారిన ఈ ఆధునిక సమాజంలో కూడా ఊరు వాడా అనకుండా పల్లెల్లో పట్టణాల్లో మహిళా మణులు అంతా చాలా పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నారు.

చివరి రోజైనా సద్దుల బతుకమ్మ రోజు తెలంగాణలో ప్రతి ఊరిలో ప్రతి పట్టణంలో చెరువుగట్లపై చాలా పెద్ద జాతరే జరుగుతుందని చెప్పొచ్చు. ఈ పూల జాతరను చూడడానికి రెండు కళ్ళు చాలవు

మహిళా మణులు అంతా సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మను నీళ్లలో నిమర్జనం చేసి, గౌరమ్మను పూసుకొంటూ, వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా పిల్లలు పెద్దలంతా ఐక్యతానురాగాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని గొప్ప నమ్మకం.



**-కాందూరి వేంకటేశ్వర్లు**
వాస్తు, జ్యోతిష పండితులు
కవి , రచయిత
శ్రీనగర్ కాలనీ ,కరీంనగర్



## సమరసతా సాహిత్యంతో ఐకమత్యం సాధిద్దాం




హైదరాబాద్, అక్టోబర్ 1: కవులు రచయితలు సమరసతా సాహిత్యం సృష్టించి సమాజ ఐకమత్యాన్ని సాధించాలని సామాజిక సమరసతా వేదిక కళా విభాగం రాష్ట్ర కన్వీనర్ బండిరాజుల శంకర్ పిలుపునిచ్చారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో సమరసతా మూర్తులు దున్న ఇద్దాసు, గుర్రం జాషువా, బోయి భీమన్న, చిలకమర్తి లక్ష్మీ నరసింహం ల జయంతి వేడుకలు మరియు కవి సమ్మేళనం జరిగింది. ప్రధాన వక్తగా హాజరైన శంకర్ మాట్లాడుతూ హిందూధర్మంలో అంటరానితనానికి తావు లేదు అని సోదాహరణంగా రాముని జీవితాన్ని వివరించారు. కవులు సమాజాన్ని కలిపే వారని, సమాజ హితంకోరే కోరే సాహిత్యాన్ని వ్రాయాలని కోరారు. ఆదిశంకరులు, రామానుజులు, వివేకానందుల వంటి వారు మానవాళి హితం కోరే పద్ధతులను ఏర్పాటు చేశారని చెప్పారు. ఎక్కడా వివక్ష ని పాటించలేదని అన్నారు. మహనీయుల స్ఫూర్తి తో మనం సామాజిక సమరసతకు నడుం బిగించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో సుమారు 40 మంది తమ సమరసత కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి రచయితల సంఘం అధ్యక్షులు పోరేటి రంగయ్య, సమరసతా శతక కర్త సామల కిరణ్, అష్టావధాని బండకాడి అంజయ్య గౌడ్ మరియు సామాజిక సమరసతా వేదిక కామారెడ్డి జిల్లా ప్రతినిధులు తుమ్మ రామచంద్రం, బాలరాజు గౌడ్, అమృత రాజ్ తదితరులు పాల్గొన్నారు.





మంగళవారం అశోక్‌నగర్‌లోని హెూవార్డ్ మోడల్ స్కూల్లో బతుకమ్మ ఆడుతున్న పాఠశాల చిన్నారులు. మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మలను శోభాయమానంగా పలు రకాల పూలతో పేర్చి బతుకమ్మకు గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ



బతుకమ్మ పండుగను భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఆడపడుచులు ఘనంగా జరుపుకునే పూల పండుగ బతుకమ్మ పూరాతనంలో బృహదమ్మ (పార్వతి) నుంచి శివలింగాన్ని వేరుచేసినందుకు గాను, తమ దు:ఖాన్ని చోళులకు తెలియజేస్తూ మెరూ పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మను నిర్వహించడం మొదలు పెట్టారు తెలంగాణ వాసులు. అలా ప్రతి ఏడాది బతుకమ్మను జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. బతుకమ్మను దాదాపు పది శతాబ్దల నుండి జరుపుకుంటున్నారు. తెలంగాణ ప్రాంతానికి సొంతమైన, శక్తివంతమైన పండుగగా తెలంగాణ వాసులు బతుకమ్మ పండుగను మహిళలు మాత్రమే విశేషంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రత్యేకంగా పూసే పువ్వులను తీసుకు వచ్చి బతుకమ్మను పేర్చి మహిళలందరూ కలిసి జరుపుకునే వేడుక. ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుకు చిహ్నం. బతుకమ్మ శీతాకాలం ప్రారంభానికి ముందు, వర్షాకాలం చివరలో అంటే రెండు కాలాలకు సంధికాలంలో వస్తుంది. వర్షాకాలంలో తెలంగాణలోని అన్ని చెరువులు , కుంటలు పుష్కలంగా నీటితో నిండి ఉంటాయి. సాగు చేయని, బంజరు భూములలో అడవి పువ్వులు వివిధ రంగులలో వికసించి ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తాయి. ప్రకృతి పరవశంలో ఉన్నప్పుడు గౌరీ దేవిని పూజించి జరుపుకునే బతుకమ్మకు ఎంతో విశిష్టత ఉంది. బతుకమ్మ పండుగ సమయంలో గునుగు పూలు, తంగేడు పూలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పల్లెలోనూ మహిళలు విశేషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. ఆడపడుచులు బతుకమ్మ వేడుకలను చేసుకోవటానికి అమ్మగారింటికి చేరుకుంటారు. పుట్టింట్లో తొమ్మిదిరోజుల పాటు రంగురంగుల పుష్పాలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజిస్తారు. వేములవాడ కరీంనగర్ జిల్లాలోని ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వర ఆలయం ఉండేది. ఆపదల్లో ఉండేవారికి రాజరాజేశ్వరి అండగా ఉంటుందని అప్పటి ప్రజలు, చోళులు నమ్మేవారు.

బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటపాటలాడి పూలను నీటిలో వదులుతారు. శివుడు లేని పార్వతి గురించి పాటలాగా పాడుతూ బతుకమ్మను జరుపుకుంటున్నారు తెలంగాణ వాసులు. బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుంది. ఈ సంబరాలు జరుపుకునే వారం అంతటా స్త్రీలు బొడ్డెమ్మలు ఆడుతూ జరుపుకునే వారు అదే విధంగా మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మను నవ రాత్రులు పూజించి బతుకమ్మతో పాటూ అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. తెలంగాణ పూల జాతర వచ్చేసింది ఈ ఏడాది బతుకమ్మ వేడుకలకు విస్తారంగా కురిసిన వర్షాలతో ఎటు చూసిన అడవి పూలు అందంగా విరబూసి రకరకాల పువ్వులు దర్శనము ఇస్తున్నాయి. భక్తితో బతుకమ్మను పూజించేందుకు సిద్ధంగా ఉన్నాయి. బతుకమ్మ పూలు అన్ని కూడా ఔషధ గుణాలను కలిగి ఉన్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు అనుగుణంగా బతుకమ్మ పేర్లు కూడా ఉంటాయి. తెలంగాణ పూల జాతర వచ్చేసింది. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. ఈ తొమ్మిది రోజుల పాటు రోజుకు ఒక రకమైన నైవేద్యాన్ని బతుకమ్మకు సమర్పిస్తారు. మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు తొమ్మిది రోజులు బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి ఎంగిలి పువ్వుల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు జరుపుకుంటారు. కులాలకు అతీతంగా వేడుకలలో పాల్గొంటారు. ముచ్చటగా ముస్తాబై బతుకమ్మలు తయారు చేసి అమ్మ, అక్కలందరూ కలసి ఆడి పాడుతారు. బతుకమ్మను పండుగను జరుపుకోవడానికి అనేక కథలు ఉన్నాయి దాంట్లో భాగంగానే చోళ రాజవంశానికి చెందిన ధర్మాంగద అనే రాజుకు ఒక కూమర్తే ఉండేది. ఈ రాజు ఎక్కువగా దక్షిణ భారతదేశాన్ని పాలించాడు. ఆ రాజుకు వంద మంది కుమారులు పుట్టి మరణించగా లక్ష్మీ దేవి అనుగ్రహంతో అతని భార్య ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది, ఆమెకు లక్ష్మి అని పేరు పెట్టారు, ఆమె పెరుగుతున్న క్రమంలో ఊహించని ప్రమాదాలు, సంఘటనల నుండి బయటపడింది, తల్లిదండ్రులు తమ ఏకైక బిడ్డను సాదుకుంటునే లక్ష్మి గురించి ఆందోళన చెందుతూ తమ కుమార్తెకు బతుకమ్మ అని పేరు పెట్టారు, అలా పెట్టడం వల్ల గండాలను అధిగమించి ఆమె బ్రతుకుతుందని విశ్వసించారు. రాజకుమార్తె పుట్టిన రోజున ఈ బతుకమ్మ పండుగను జరుపుకునేవారు. అమ్మవారిని భక్తితో ఆరాధిస్తూ ఈ పండుగను జరుపుకోవడం వల్ల శుభాలు కలుగుతాయని భావించేవారు. బతుకమ్మ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కూడా కీలకంగా మారింది, ఊరురా బతుకమ్మ ఆట పాటతో తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపింది. బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యపాత్ర పోషించింది. రాష్ట్రం వచ్చాక బతుకమ్మ పండుగను అధికారికంగా ప్రకటించింది గత రాష్ట్ర ప్రభుత్వం. నేడు బతుకమ్మ ప్రపంచ వ్యాప్తం అయింది.



**-మిద్దె సురేష్**
9701209355

## గాయత్రీ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

**- జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంలో పాల్గొని ప్రసంగించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వి.సుబ్బారావు**
**- రక్తదానం చేయడం ద్వారా ప్రాణ దాతలు కావొచ్చు వి.సబ్బారావు**

ఖమ్మం, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ సహకారంతో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పర్యవేక్షణలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులతో రక్తదాన ప్రతిజ్ఞ నిర్వహించడంతో పాటు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి వి.సుబ్బారావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రాజేశ్వర రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖాధికారి వి. సుబ్బారావు మాట్లాడుతూ...రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యవంతులు ఒక సంవత్సరంలో మూడు సార్లు రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావొచ్చని అపోహలు వదిలి రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్క యువతి, యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యమంలో డా.ఎల్.కిరణ్ సూపరింటెండెంట్ ప్రభుత్వ ఆసుపత్రి, డా.వెంకటరమణ పి.ఓ,డి.ఎల్.ఓ, జిల్లా ఎన్.ఎస్.ఎస్ పి.ఓ శ్రీనివాస్, డా.సందీప్ ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, కళాశాల చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ కె.కుటుంబరావు, కేతినేని సురేష్, కళాశాల ఎన్.ఎస్.ఎస్ పి.ఓ అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉపేందర్, ఉమా శంకర్, శ్రీనివాస్, రాజేష్, కల్పన, మల్లేష్, రామాంజనేయులు, సౌమ్య, నాగమణి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు.


**BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-XXVII ADDL. CHIEF JUDGE: C.C.C AT SECUNDERABAD**

M.V.O.P.NO.266 OF 2024

**Between:**
Madas Srinivas ....Petitioner
**AND**
Mr. B. Chandra Shaker & Others ..Respondents

To
1. Mr. B. Chandra Shakar, S/o. B. Ramaiah, Aged about: Major, Occ: Car Driver,R/o. H.No. 9-1-21, Arunakka Nagar, Singapur, Srirampur colony, Mancheriayal, T.S- 504 303.
2. Smt. Anaganti Gattamma, W/o. Mallaiah, Aged about: major, Occ: Business, R/o. H.No.4-120/8-1,Jaffar Nagar, Mancherial.T.S-500068

**NOTICE**

Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1 and 2) for compensation of Rs.10, 00, 000/- and the same is posted for your appearance on **03-10-2024**.

You are advised to appear on **03-10-2024** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(By the Order or the court)

M/s. Godugu Krishna (TS/1539/2017) Advocate
#H.No.12-11-757/1, Flat no.101,Sri Bajrang Castle, Boudha Nagar, Warasiguda, Secunderanad-61
godugukrishna17@gmail.com
Counsel for Petitioner
Cell: 9959858035.


## ఆరోగ్య భద్రతనిచ్చేది - సీఎం సహాయ నిధి: కెపి.వివేకానంద్

హైదరాబాద్, అక్టోబర్ 1: సీఎం సహాయ నిధి ఆరోగ్య భద్రతనిచ్చేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఈరోజు పేట్ బషీరాబాద్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 125 ? గాజులరామారం డివిజన్ కైసర్ నగర్, హెచ్ఏఎల్ కాలనీలకు చెందిన బుట్టి, సంపూర్ణల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి బుట్టి తండ్రి జోషెడ్ (రూ.50,000/-), సంపూర్ణ భర్త పి.వెంకటేశ్వర రెడ్డి (1,10,000/-) లకు మంజూరు చేయించి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): శ్రీ చైతన్య స్కూల్లో బతుకమ్మ సంబరాలు ఆకట్టుకున్న విద్యార్థినుల ఆటపాటలు నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూల పండుగ వైభవంగా జరిగింది. దసరా సెలవులకు ముందు చివరి పని దినం అయిన మంగళవారం పాఠశాలలో పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బతుకమ్మ ఆటలు.. సంప్రదాయ పాటలు.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ ఆటపాటలు ఆకట్టుకున్నాయి. పాఠశాల మహిళా అధ్యాపకులు, మరియు విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై బతుకమ్మ ఆడారు. ఇతర అధ్యాపకులు అందరూ కూడా బతుకమ్మ సంబరాల్లో భాగస్వామ్యం అయ్యారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ప్రాంగణం అంతా కళకళలాడింది . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో హోరెత్తిన బతుకమ్మ సంబురం

**- బతుకమ్మలను పేర్చి ఆటాపాటల్లో విద్యార్థినీల హుషారు**
**- పూజలు,చప్పట్లు,తాళాలు నృత్యాలతో బతుకమ్మ వేడుకలు**




ఖమ్మం, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తున్న బతుకమ్మ సంబురాలు స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో మంగళవారం హోరెత్తాయి. పాఠశాల చిన్నారులు మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మలను శోభాయమానంగా పలు రకాల పూలతో పేర్చి బతుకమ్మకు గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాల మైదానంలో తాము రూపొందించిన బతుకమ్మలను ఉంచి వలయాకారంలో బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా చప్పట్లు తాళాలతో నృత్యాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఒక్కేసి పువ్వేసి చందమామ, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పలురకాల గేయాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు.విద్యార్థినీలు, మహిళా ఉపాధ్యాయునీలు పాఠశాల నుంచి బతుకమ్మలతో పాఠశాల మైదానం వరకు ప్రదర్శనతో కనువిందు చేసి సంబురాలు నిర్వహించారు. పలు రకాల నైవేద్యాలను గౌరీ మాతకు నివేదన చేసి అనంతరం నైవేద్యాలను అందరికీ పంచి ఆనందోత్సవాలతో బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పారు. అనంతరం బతుకమ్మలను నీళ్లలో నిమజ్జనం చేసే ప్రక్రియ ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మాట్లాడుతూ...బతుకమ్మ వేడుకలు మన రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తూ విశ్వవ్యాప్తంగా ప్రతిష్టను పెంచుతున్నాయన్నారు. పుష్పాలనే భగవంతునిగా భావించి కొలిచే అరుదైన పర్వదినం బతుకమ్మ సంబరాల ద్వారా తొమ్మిది రోజులు నిర్వహిస్తున్నామన్నారు. తొలి రోజు జరిపే ఎంగిలిపూల బతుకమ్మ మొదులుకొని చివరి రోజున జరిపే సద్దుల బతుకమ్మ వేడుకల వరకు మహిళలంతా సమైక్యతను, అనుబంధాలను, ఆప్యాయతను, ఆనందాలను పంచుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.